నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 24-3-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక: 194 పేజీలు: 4 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

గోమూత్రవైద్యం
మేతకు అడవులు
రోడ్లపై నేడు.

క్షీరాభిషేకం
అల్పానంద జీవులు
బురదపాలు.

ఊబిలో దున్న
చెప్పనంత ఆనందం
జలగ జల్సా.

చిరుధాన్యాలు
పచ్చని ఆకు కూర
ఆరోగ్య బీమా.

సంఘంశరణం
ఎన్నికల నినాదం
వాత తర్వాత.

- రేడియమ్
సెల్: 9291527757

నీనిజాయి

కొడితె పోయి ఉద్యోగులు
పడ్డారోయ్ పరుపులోన
కాలుతగిలె వెతికెతీగె
కరోనాలొ కరువులోన

పీఆర్సీ ప్రకటనతో
మప్పయ్ శాతం ఫిట్ మెంట్
ఉద్యోగ ఉపాధ్యాయులు
అరవదొకటికి రిటైర్ మెంట్

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

ఆర్థిక విధానాల్లో న్యాయ సమీక్ష కుదరదు

ఆరు నెలల మారిటోయంపై చక్రవడ్డీ వసూలు చేయొద్దు
విచారణ సందర్భంగా వెల్లడించిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ,మార్చి23(ఆర్ఎన్ఎ): ఆర్థిక విధానాల్లో న్యాయపరమైన సమీక్ష చేపట్టలేమని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. కోవిడ్ మహమ్మారిని దృష్టిలో పెట్టుకుని మారటోరియం కాలంలో చక్రవడ్డీని మాఫీ చేయాలని, మారటోరియంను పొడిగించాలని దాఖలైన పిటిషన్లపై సుప్రీం కోర్టు తాజాగా విచారణ జరిపింది. మారటోరియం కాలాన్ని పొడిగించడం, మొత్తం వడ్డీని మాఫీ చేయమని ఆదేశించడం సాధ్యం కాదని తీర్పునిచ్చింది. అలాగే ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీలు, ఉపశమనాలు ప్రకటించాలని కేంద్రానికి ఎలాంటి ఆదేశాలూ జారీ చేయలేమని జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సంజీవ్ ఖన్నాలతో కూడిన ధర్మాసనం తాజాగా స్పష్టం చేసింది. మారటోరియం కాలానికి రుణాలపై ఎలాంటి చక్రవడ్డీ విధించొద్దని ఆదేశించింది. అయితే ఆగస్టు 31 వరకు ఉన్న మారటోరియం కాలాన్ని పొడగించాలని కేంద్రాన్ని ఆదేశించలేమని స్పష్టం చేసింది. ఇప్పటికే రూ.2 కోట్లవరకు ఉన్న రుణాలపై చక్రవడ్డీని కేంద్రం మాఫీ చేసిందని కోర్టు ఈ సందర్భంగా వెల్లడించింది. కరోనా మహమ్మారి కాలంలో కేంద్ర ప్రభుత్వం కూడా తీవ్రంగా నష్టపోయిందని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీలను ప్రకటించాయని గుర్తు చేసింది. నిర్ణయాలు ఏకపక్షంగా ఉంటే తప్ప కేంద్రం ఆర్థిక నిర్ణయాలను న్యాయ సమీక్ష చేయలేమని పేర్కొంది. ప్రత్యేక ఆర్థిక ఉపశమనం లేదా ప్యాకేజీలను ప్రకటించమని ప్రభుత్వాన్ని లేదా కేంద్ర బ్యాంకును ఆదేశించలేమని, ప్రత్యేక రంగాలకు ఉపశమనం అడగలేమని కూడా సుప్రీం ధర్మాసనం తేల్చి చెప్పింది. అలాగే ఈ ఆరు నెలల కాలానికి రుణ గ్రహీతలనుంచి చక్రవడ్డీ వసూలు చేయొద్దని తెలిపింది. మారటోరియం కాలాన్ని పొడిగించడం, మొత్తం వడ్డీ మాఫీ సాధ్యం కాదని తేల్చి చెప్పింది. ఖాతాదారులకు, పెన్షనర్లకు బ్యాంకులు వడ్డీ చెల్లిస్తాయి, మరి అలాంటప్పుడు బ్యాంకులు రుణాలపై పూర్తిగా వడ్డీని ఎలా మాఫీ చేయగలవని సుప్రీం ప్రశ్నించింది. తేదాది భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్‌బీఐ) విధించిన మారటోరియం 2020 ఆగస్టుతో ముగిసింది. రుణాలపై వడ్డీ వసూళ్ల మీద మారటోరియం పొడిగించడానికి కేంద్ర ఆర్థికశాఖ, ఆర్బీఐ నిరాకరించాయి. ఇప్పటికే రూ.2 కోట్ల వరకు రుణాలపై కేంద్రం వడ్డీ మాఫీ చేసిన సంగతి తెలిసిందే.

శంషాబాద్‌లో విదేశీ కరెన్సీ పట్టివేత

హైదరాబాద్,మార్చి23(ఆర్ఎన్ఎ): శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు విదేశీ కరెన్సీని పట్టుకున్నారు. హైదరాబాద్ నుంచి దుబాయికి వెళ్తున్న ఓ ప్రయాణికుడి వద్ద రూ.11.50లక్షల విలువ చేసే కరెన్సీని కస్టమ్స్ అధికారులు గుర్తించి, పట్టుకున్నారు. లగేజ్ బ్యాగులో కరెన్సీ దాచి తరలించే ప్రయత్నం చేయగా.. స్కానింగ్ చేస్తుండగా.. కరెన్సీ పట్టుబడింది. కస్టమ్స్ అధికారులు సదరు ప్రయాణికుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్జకుంటలో చిరుత సంచారం

కామారెడ్డి,మార్చి23(ఆర్ఎన్ఎ): భిక్కనూర్ మండలంలో చిరుత సంచారం కలకలం రేపుతోంది. మండలంలోని గుర్జకుంట గ్రామం వద్ద ఓ కారుకు చిరుత పులి అడ్డంగా వచ్చింది. చిరుత పులిని చూసి భయాందోళనకు గురి అయిన కారులో ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. చిరుత పులి భిక్కనూర్ సిద్ధరామేశ్వర్ టెంపుల్ వైపు వెళ్లినట్లు ప్రయాణికులు తెలిపారు. విషయం తెలుసుకున్న గుర్జకుంట, ర్యాగట్లపల్లి, సిద్ధరామేశ్వరనగర్ గ్రామాల ప్రజలు భయం దోళనకు గురవుతున్నారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో గ్రామానికి చేరుకున్నారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు బయపడొద్దని సూచించారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు రాజ్యసభ నివాళి

న్యూఢి ల్లీ,మార్చి23(ఆర్ ఎన్ ఎ): స్వాతంత్య్ర సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు వీరమరణం పొందిన రోజు ఇవాళ. 90వ వర్ధంతి సందర్భంగా రాజ్యసభలో చైర్మెన్ వెంకయ్య నాయుడు నివాళి అర్పించారు. ధైర్యసాహసాలకు, దేశభక్తికి.. ఆ ముగ్గురి పేర్లు ఇంటి పేర్లుగా మారినట్లు వెంకయ్య తెలిపారు. యావత్ దేశానికి ఆ ముగ్గురు యోధులు ప్రేరణగా నిలుస్తున్నారన్నారు. భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులకు నివాళిగా సభ్యులు నిమిషం పాటు మౌనం పాటించారు. లోక్‌సభలోనూ ఇవాళ స్పీకర్ కీర్తి సోలంకి నివాళి అర్పించారు. భగత్ సింగ్‌కు నివాళి అర్పిస్తూ ప్రకటన చేశారు. రెండు నిమిషాల పాటు సభ్యులు మౌనం పాటించారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కృషి

కులవృత్తులను ప్రోత్సహించడం అందుకే
సభ్యుల ప్రశ్నలపై మంత్రి తలసాని జవాబు

హైదరాబాద్,మార్చి23(ఆర్ఎన్ఎ): గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్రంలోని కులవృత్తులకు ఆర్థిక సాయం అందిస్తున్నారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలో గొర్రెల పంపిణీ తర్వాత దాని నుంచి వచ్చిన సంపద రూ. 5,490 కోట్లు అని మంత్రి తెలిపారు. ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రంలో లభ్యంగా ఉంచిన గొర్రెల యూనిట్ల సంఖ్య 3,66,976 అని తెలిపారు. గొర్రెల పంపిణీ కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు 4 వేల 587 కోట్ల 20 లక్షలను ఖర్చు చేసిందన్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా గొర్రెల యూనిట్ల పంపిణీపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సమాధానం ఇచ్చారు. ఆర్థిక వనరులను ఉపయోగించుకుని కులవృ త్తులను సీఎం కేసీఆర్ ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. సీఎం సంకల్ప బలం చాలా గొప్పదన్నారు. గొల్లకురుమలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గొర్రెల పంపిణీ కార్య క్రమానికి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారు. గత ప్రభుత్వాలు చేయలేని పనులను ఈ ప్రభుత్వం చేస్తుందన్నారు. కరోనా కారణంగా గొర్రెల రేట్లు బాగా పెరిగిపోయాయి. ఈ బ్జడెట్‌లో గొర్రెల పంపిణీకి 3 వేల కోట్లు కేటాయింపు చేశారన్నారు. మరో 3 లక్షల మందికి గొర్రెలు పంపిణీ చేయబోతున్నామని తెలిపారు. అడవుల్లో గొర్రెలను మేపుకోవడానికి సీఎం కేసీఆర్ అనుమతి ఇచ్చారు. గొర్రెల మేతకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం అని మంత్రి తలసాని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న డీడీలకు త్వరలోనే క్లియర్ చేస్తామన్నారు. రెండో ఫేజ్‌కు విధివిధానాలు ఖరారు చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో గొర్రెల సంఖ్య 3 కోట్లకు చేరింది. గతంలో గొర్రెల సంఖ్య కోటి 20 లక్షలు మాత్రమే ఉండేదన్నారు. ఈ లెక్కలను కేంద్రం పార్లమెంట్‌లో వెల్లడించిందని తెలిపారు.

తెలంగాణకు కేంద్ర సాయం గుండుసున్నా

ఆత్మనిర్భర భారత్ సాయం ఎవరికిచ్చారో తెలీదు
రూ. 20 లక్షల కోట్ల ప్యాకేజీ ఏమైందో కూడా తెలియదు
టీఎస్ ఐపాస్ కింద 15,326 పరిశ్రమలకు ఆమోదం
-అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో కెటిఆర్ వెల్లడి

హైదరాబాద్,మార్చి23(ఆర్ఎన్ఎ): కేంద్రంపై మరోసారి మంత్రి కేటీఆర్ ఫైర్ అయ్యారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా టీఎస్ ఐపాస్ కింద పరిశ్రమలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి కేటీఆర్ సమాధానం ఇస్తూ.. ఏపీ పునర్విభజన చట్టంలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో పారిశ్రామికీకరణకు సహాయం చేయాలని, రాయితీలు ఇస్తామని పేర్కొన్నప్పటికీ ఎలాంటి సాయం అందలేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రాయితీలను ఇవ్వాలని ప్రభుత్వం కోరుతుందన్నారు. ఆరున్నరేండ్లలో తెలంగాణకు కేంద్రం అణా పైసా కూడా సహాయం చేయలేదన్నారు. కేంద్రం తెలంగాణకు చేసింది గుండు సున్నా అని ధ్వజమెత్తారు. వారు పార్లమెంట్‌లో చేసిన చట్టాన్నే తుంగలో తొక్కుతున్నారని నిప్పులు చెరిగారు. కేంద్రం తెచ్చిన రూ. 20 లక్షల కోట్ల ప్యాకేజీ ఏమైందో ఎవరికి తెలియదన్నారు. ఈ ఆత్మనిర్భర్ ప్యాకేజీ వల్ల తెలంగాణకు ఎలాంటి ప్రయోజనం కలగలేదన్నారు. కేవలం వీధి వ్యాపారులకు మాత్రమే రూ. 10 వేల లోన్లు ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. దీనివల్ల లబ్ధి పొందిన వారెవరో కూడా తెలియడం లేదన్నారు.

ప్రశ్నోత్తరాల సందర్భంగా టీఎస్ ఐపాస్ కింద వచ్చిన పరిశ్రమలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి కేటీఆర్ సమాధానం ఇచ్చారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ఆరు సంవత్సరాల్లో టీఎస్ ఐపాస్ కింద 15,326 పరిశ్రమలు ఆమోదం పొందాయన్నారు. ఇందులో ఇప్పటికే 11,954 పరిశ్రమలు తమ కార్యకలాపాలను ప్రారంభించాయన్నారు. టీఎస్ ఐపాస్ ద్వారా రూ. 2 లక్షల 13 వేల 431 కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని తెలిపారు. కాగా ప్రస్తుతం రూ. 97,405 కోట్ల పెట్టుబడులు తమ కార్యక్రమాలను ప్రారంభించినట్లు చెప్పారు. ఈ పెట్టుబడుల ద్వారా 15,52,672 మందికి ఉపాధి కల్పించొచ్చని అంచనా వేశామన్నారు. ప్రస్తుతం 7,67,729 మంది ఉపాధి పొందుతున్నారని మంత్రి పేర్కొన్నారు. 2014, నవంబర్‌లో టీఎస్ ఐపాస్ చట్టాన్ని ఆమోదించుకున్నామని తెలిపారు. ఏపీ పునర్విభజన చట్టంలో పారిశ్రామికీకరణకు సహాయం చేయాలని, రాయితీలు ఇస్తామని పేర్కొన్నప్పటికీ ఎలాంటి సాయం అందలేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రాయితీలను ఇవ్వాలని ప్రభుత్వం కోరుతుందన్నారు. వెనుకబడిన జిల్లాలకు కూడా పరిశ్రమలను విస్తరిస్తామని మంత్రి తెలిపారు. ఏరోస్పేస్ ఇండస్ట్రీ తీసుకుంటే ఆదిభట్ల ప్రాంతంలో ఉంది. ఎలక్ట్రిక్ పరిశ్రమలు హైదరాబాద్‌కు దక్షిణం వైపు ఉన్నాయి. పరిశ్రమలను వికేంద్రీకరిస్తామని తెలిపారు. నైపుణ్య శిక్షణతోనే ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. టాస్క్ సమర్థవంతంగా పని చేస్తూ.. యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తుందన్నారు. ఆత్మ నిర్భర్ వల్ల రాష్ట్రానికి ఏం లాభం జరగలేదని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు.

షహీద్ దివస్ సందర్భంగా ప్రధాని నివాళి

న్యూఢి ల్లీ,మార్చి23(ఆర్ఎన్ఎ): షహీద్ దివస్ సందర్భంగా మంగళవారం ముగ్గురు స్వాతంత్ర్య సమరయోధులైన భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులకు ప్రధాని నరేంద్ర మోదీ నివాళులర్పించారు. వాళ్ల త్యాగాలు ఈ దేశంలోని ప్రతి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయని మోదీ అన్నారు. ముగ్గురూ కలిసి బ్రిటీష్ పోలీస్ అధికారి జేపీ శాండర్స్‌ను హత్య చేశారు. దీంతో బ్రిటీష్ ప్రభుత్వం వీరికి మరణశిక్ష విధించింది. అమరవీరుల దినోత్సవం నాడు విప్లవకారులు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులకు జోహార్లు అని మోదీ ట్వీట్ చేశారు. భరతమాత ముద్దుబిడ్డలైన వీళ్ల త్యాగాలు అన్ని తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని ఆయన అన్నారు. బ్రిటీష్ ప్రభుత్వం ఈ ముగ్గురినీ ఇదే రోజు ఉరితీసింది.

మైనార్టీ స్కూళ్లను బలోపేతం చేశాం

అసెంబ్లీలో వెల్లడించిన కొప్పుల

హైదరాబాద్,మార్చి23 (ఆర్ ఎన్ ఎ) :తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం ఇప్పటి వరకు 204 అల్పాసంఖ్యాక వర్గాలకు పాఠశాలలు ఏర్పాటు చేసిందని మంత్రి కొప్పుల ఈశ్వర్ వెల్లడించారు. 2018-19లో 12 పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశామన్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా ఆశ్రమ పాఠశాలలను జూనియర్ కళాశాలల స్థాయి పెంపుపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి కొప్పుల ఈశ్వర్ సమాధానం ఇచ్చారు. 2020-21లో 71 టీఎంఆర్ పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశాం. మైనార్టీ వర్గాల్లోని ముస్లింలు, క్రైస్తవులతో పాటు ఇతర వర్గాలకు నాణ్యమైన విద్యను అందించేందుకు సీఎం కేసీఆర్ గురుకుల పాఠశాలలను ప్రారంభించారు. 2016-17లో 71, 2017-18లో 133 టీఎంఆర్ పాఠశాలలను ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం బాలురకు 107 పాఠశాలలు, బాలికలకు 97 పాఠశాలలు ఉన్నాయి. మొత్తంగా 30,560 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. 7,570 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు అని మంత్రి తెలిపారు.

బెంగాల్ ఎన్నికల్లో సామాన్యురాలికి బిజెపి టిక్కెట్

కోల్‌కతా,మార్చి23 (ఆర్ఎన్ఎ): పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో అస్‌గ్రామ్ నియోజకవర్గం నుంచి ఓ పని మనిషిని తమ అభ్యర్థిగా బిజెపి బరిలోకి దింపింది. ఆమెను ఎంపిక చేయటంపై స్థానిక భాజపా కార్యకర్తలు ఒక్కసారిగా అవాక్కయ్యారు. కలితా ఎవరు? అంటూ సందేహంలో పడిపోయారు. నెల రోజులపాటు తన పనికి సెలవు పెట్టి, ప్రచారం చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు కలితా. కలితా భర్త సుబ్రతా మజ్జీ.. ఓ ప్లంబర్. పేదరికం కారణంగా ఆమె చదువుకోలేదు. ప్రచారంలో నేరుగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీపైనే విమర్శల బాణం ఎక్కుపెట్టారు. ఆట ఆడదాం అని ఎన్నికల ప్రచారంలో దీదీ చేస్తున్న నినాదాన్ని ఉద్దేశించి... 'మోకాలి గాయంతో ఎన్నికల ఆటను మమత ఎలా ఆడతారు' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ముద్ర అగ్రి&స్కిల్ డెవలప్‌మెంట్ ఎం.ఎస్. ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 7న జరిగిన సభలో మానస రఘుశ్రీ రచించిన 'కవీంద్ర మోక్ష' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న తెలంగాణ మానవహక్కుల కమీషన్ ఛైర్మన్ జస్టిస్ జి. చంద్రయ్య. చిత్రంలో బండారుపల్లి, తిప్పినేని రామదాసప్పనాయుడు, జస్టిస్ చంద్రకుమార్, డా॥వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, దైవజ్ఞశర్మ, మాధవి, రమ తదితరులు పాల్గొన్నారు.



మంగళవారంనాడు తెలంగాణ బడుగు బలహీన వర్గాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అంబరపేట పటేల్‌నగర్‌లో రాజకీయ ఉద్యమ జీవితం గడిపిన యుగకర్త, కర్మయోగి డా॥ రాంమనోహర్ లోహియ జయంతి సభలో ప్రసంగిస్తున్న రాష్ట్ర బీసీ కమీషన్ పూర్వ సభ్యులు డా॥ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు.

అమెరికాలో మరోసారి కాల్పుల కలకలం -కొలరాడో సూపర్ మార్కెట్‌లో దుండగుడి కాల్పులు

పోలీసు అధికారి సహా 10 మంది మరణం

వాషింగ్టన్,మార్చి23(ఆర్ఎన్ఎ): అమెరికాలో మరోసారి కాల్పుల కలకలం రేగింది. సోమవారం కొలరాడోలోని ఓ సూపర్ మార్కెట్‌లోకి ప్రవేశించిన దుండగుడు విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఓ పోలీసు అధికారి సహా 10 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. కాల్పులు జరుపుతున్న వ్యక్తిని పట్టుకునే క్రమంలో ఓ పోలీస్ ఆఫీసర్ లోపలికి వెళ్లారు. ఈ క్రమంలో దుండగుడు అతనిపై కూడా కాల్పులు జరపగా, పోలీసు అధికారి అక్కడికక్కడే మరణించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అర్ధ నగ్నంగా సూపర్‌మార్కెట్‌లోకి ప్రవేశించిన దుండగుడు కాల్పులకు తెగబడినట్టు జరిపినట్లు సమాచారం.

ఇక ఈ ఘటనలో ఉన్మాదికి సైతం గాయాల య్యాయి. ప్రస్తు తం అతడిని పోలీసులు అదుపులోకి తీసు కున్నారు. ÷చాల్పులు జరిగిన సూపర్ మార్కెట్ ప్రాంతాన్ని భద్రత సిబ్బంది ఆధీనంలోకి తీసుకున్నారు. ఆ ప్రాంతాన్ని పోలీసులు చుట్టుముట్టారు. కాల్పుల నుంచి బయటపడ్డ ప్రత్యక్షసాక్షి ఒకరు మాట్లాడుతూ...'సోడా, చిప్స్ తీసుకోవడానికి సూపర్ మార్కెట్‌కి వెళ్లాను. దుండగుడు 8 రౌండ్లు విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ దాడిలో నేను దాదాపు చనిపోతాననుకున్నా. ఒకరికొకరం సహాయం చేసుకుంటూ సూపర్ మార్కెట్ బయటకు పరుగెత్తుకొచ్చాం. కానీ దురదృష్టవశాత్తూ కొందరు షాక్‌లోనే ఉండిపోయారు' అని పేర్కొన్నాడు. ÷చాల్పుల ఘటనపై కొలరాడో గవర్నర్ జారెడ్ పోలిస్ దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. బౌల్డర్‌లో చోటుచేసుకున్న ఘటన తీరని విషాదాన్ని కలిగిస్తుంది. దీనిపై మాట్లాడటానికి మాటలు రావడం లేదు. ఈ ఘటన నన్ను కలిచి వేస్తుంది అని ట్వీట్ చేశారు.

5లక్షల వరకు రిటర్న్స్ ఫైల్ లేకుండా చేయాలి

డబుల్ ఇళ్ల పథకాన్ని దేశవ్యాప్తం చేయండి
పునర్విభజన చట్టం మేరకు ప్రాజెక్టులను ఇవ్వండి
లోక్‌సభలో టిఆర్ఎస్ ఎంపి నామా నాగేశ్వర రావు డిమాండ్

న్యూఢిల్లీ,మార్చి23(ఆర్ఎన్ఎ): సీనియర్ సిటిజన్లకు ఇచ్చిన మినహాయింపు తరహాలో 5 లక్షల వరకు జీరో ట్యాక్స్ రిటర్న్స్ ఉంటే బెటర్ అని ఎంపీ నామా నాగేశ్వర రావు తెలిపారు. 5 లక్షల ఆదాయం ఉన్న వారికి రిటర్న్స్ ఫైల్ చేయకుండా మినహాయింపు ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం డిస్ప్యూట్ రిజల్యూషన్ స్కీమును ఏర్పాటు చేయడం మంచి నిర్ణయమని, కానీ దానికి టైం లైన్ ఫ్రేమ్ చేయాలన్నారు. ఫైనాన్స్ బిల్లుపై ఇవాళ లోక్‌సభలో ఎంపీ నామా నాగేశ్వర రావు మాట్లాడారు. విశ్వవ్యాప్తంగా కోవిడ్ వల్ల అన్ని దేశాలపై ఆర్థిక ప్రభావం పడిందని, కేంద్ర ఆర్థిక మంత్రి ఏదైనా ఇస్తారని రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచిం చాయని, ఎలా సపోర్ట్ చేస్తారని వెయిట్ చేశారని,పేద వాళ్లకు ఇండ్లు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయిం చింది, మా రిక్వెస్ట్ ఏంటంటే, తెలంగాణలో డబుల్ బెడ్ రూమ్ ఇస్తున్నామని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను దేశవ్యాప్తం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. క్వాలిటీ కాటన్ ఉత్పత్తిలో తెలంగాణ నెంబర్ వన్, దాన్ని ప్రమోట్ చేసేందుకు, రైతులను రక్షించేందుకు ప్రభుత్వం ఆలోచించాలన్నారు. పత్తిపై దిగుమతి సుంకాన్ని 15 శాతానికి పెంచారన్నారు. పెట్రోల, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించేందుకు ప్రయత్నించాలన్నారు. ఏపీ పునర్ విభజనం చట్టం ప్రకారం రావాల్సిన ప్రాజెక్టులు, ఫండ్స్ రావాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. తెలంగాణలో మెగా టెక్స్‌టైల్స్ పార్క్ ఏర్పాటు చేయాలని కోరారు. సిరిసిల్లాలో మెగా పవర్‌లూమ్ పార్క్‌ను ఏర్పాటు చేయాలన్నారు. రైల్వే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో భాగంగా.. వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వాలని అభ్యర్థించారు. కొచ్చిన్, చెన్నై, బెంగుళూరు, నాగపూర్ పట్టణాలకు మెట్రో రైల్వే నిధులు కేటాయించారని, హైదరాబాద్ లో కూడా సెకండ్ ఫేస్ కోసం నిధులు ఇవ్వాంటూ ఎంపీ నామా కోరారు. సైనిక్ స్కూళ్లు, ఏకలవ్య స్కూళ్లను తెలంగాణకు ఇవ్వాలంటూ ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ నుంచి చాలా మొత్తంలో కేంద్రానికి ఆదాయం వస్తోందని, దాంట్లో మెజారిటీ షేర్ రాష్ట్రానికి ఇవ్వాలన్నారు. పవర్ సప్లయ్‌లో తెలంగాణ నెంబర్ వన్ అన్నారు. రైతులకు 24 గంటల కరెంటు ఇస్తున్నామన్నారు. ఐటీ ఎగుమతుల్లో 17 శాతం హైదరాబాద్ నుంచి జరుగుతోందన్నారు. వంద శాతం మందికి డ్రింకింగ్ వాటర్ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ అని కేంద్ర మంత్రులు మెచ్చు కున్నారని, తెలంగాణ ఏర్పడిన ఏడేళ్లలో ఇది సాధ్యమైందన్నారు. డెవలపింగ్ స్టేట్‌కు సపోర్ట్ కావాలి. డీవల్యూ షన్ కింద 5000 కోట్లు ఇవ్వాలని ఎంపీ నామా కేంద్రాన్ని కోరారు. జీఎస్టీ పెండింగ్ నిధులను కూడా ఇవ్వాలన్నారు.

ఫుడ్ పార్క్ కోసం నర్సంపేటలో భూ సేకరణ

చిన్ననీటి వనరులను కాపాడుకుంటామన్న కెటిఆర్
అసెంబ్లీలో సభ్యుల ప్రశ్నలకు మంత్రి సమాధానం

హైదరాబాద్,మార్చి23(ఆర్ఎన్ఎ): ఫుడ్ పార్క్ కోసం వరంగల్ గ్రామీణ జిల్లాలోని నర్సంపేట గ్రామంలోని సర్వే నంబర్ 813లోని ప్రభుత్వ అసైన్డ్ భూమికి సంబంధించి 46 ఎకరాల 29 గుంటల భూమిని గుర్తించామని మంత్రి కెటిఆర్ అన్నారు. జిల్లా కలెక్టర్ త్వరలోనే భూసేకరణ పక్రియను పూర్తి చేస్తారని తెలిపారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తవుతున్నాయి. చిన్న నీటి వనరులను కాపాడుకుంటున్నామని చెప్పారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా నర్సంపేటలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు అర్బన్ డెవలప్మెంట్ మినిస్టర్ కేటీఆర్ సమాధానం ఇచ్చారు. సంబంధిత జిల్లా కలెక్టర్ స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటు కోసం భూములను గుర్తించారు. రాష్ట్రంలో అద్భుతంగా భూగర్భ జలాలు పెరుగుతున్నాయని స్పష్టం చేశారు. సిరిసిల్లలో 6 మీటర్లు భూగర్భ జలాలు పైకి వచ్చా యన్నారు. నీటి వనరులను పెంచుకోవ డంతో.. వ్యవసాయ దిగుబడులు, ఆహార ఉత్పత్తులు ఇబ్బడిముబ్బడిగా పెరగబోతున్నాయి. ఆగ్రో ప్రాసెసింగ్, ఫుడ్ ప్రాసెసింగ్‌పై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఫుడ్ మ్యాప్ ఆఫ్ తెలంగాణను కూడా ఇప్పటికే ఏర్పాటు చేశామన్నారు. హార్టికల్చర్, అగ్రికల్చర్ రంగాలపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ఎక్కడ ఏ పరిశ్రమను ప్రోత్సహించాలి అనే అంశంపై ప్రభుత్వం పూర్తి అవగాహనతో ఉందని మంత్రి కేటీఆర్ తెలిపారు.

నేర పరిశోధనలో తెలంగాణ పోలీసులు బెస్ట్

-బడ్జెట్ పద్దులపై చర్చలో ఎమ్మెల్యే క్రాంతి

హైదరాబాద్,మార్చి23(ఆర్ఎన్ఎ): నేర పరిశోధనలో తెలంగాణ పోలీసులు బెస్ట్ అని టీఆర్ఎస్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ తెలిపారు. పోలీసు శాఖ పద్దులపై శాసనసభలో ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ మాట్లాడారు. ప్రపంచ చిత్ర పటంలోనే తెలంగాణ పోలీసులకు మంచి గుర్తింపు వచ్చింది. శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయి. దీంతో పెట్టుబడులు వెల్లువలా తరలివస్తున్నాయి. అత్యున్నత జీవన ప్రమాణాలను నెలకొల్పుతున్నామని తెలిపారు. శాంతి భద్రతలను అదుపులో ఉంచేందుకు రాష్ట్ర పోలీసు యంత్రాంగం నిర్విరామంగా కృషి చేస్తోంది. తెలంగాణ పోలీసుల పనితీరు అద్భుతంగా ఉందన్నారు.

ఒకప్పుడు పోలీసులంటేనే ప్రజలు భయపడేవారు.. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో పోలీసులకు ప్రజలపై నమ్మకం పెరిగిందన్నారు. నేరాలను నియంత్రించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కెమెరాల ఏర్పాటుతో నేరాలను పూర్తిగా అరికట్

నేటినిజం
సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 బుధవారం 24-3-2021

గత రెండు సంవత్సరాల నుండి "నేటినిజాలు" శీర్షికతో నేటినిజంలో వారం వారం ప్రచురిస్తున్నవన్ని కలపి త్వరలో పుస్తకం రూపంలో తీసుకువస్తున్నాను. మే నెలలో అనంతపురం రావాలని కోరిన సీనియర్ జర్నలిస్టు, ఏ వాదానికి లొంగని, ఏ కల్మషం అంటని సమున్నత కవి కెరె జగదీష్ శారీరకంగా నిద్రించాడు..

'ఎల్లక్క' దీర్ఘ కవిత పుస్తకంపై నేటినిజంలో సమీక్ష చూడాలని వుంది అన్నాడు. దీర్ఘ కవిత గొప్పగా వుంది. ఇలా ఎలా రాయగలిగావో నీకు అభినందనలు. వచ్చేవారం సమీక్ష వేస్తున్నాం అని బదులిచ్చాను. ఈ రోజు సంచికలో ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు దాస్యం సేనాధిపతి 'ఎల్లక్క' దీర్ఘ కవితపై రాసిన సమీక్షను ప్రచురిస్తున్నాము. కానీ "రాత్రి సూర్యుడు" కెరె జగదీష్ సమీక్ష చదవకుండానే నిన్న రాత్రి శాశ్వతంగా నిద్రలోకి వెళ్ళిపోయాడు.

కొన్నేళ్ళుగా నేటినిజంతో ఆయనకున్న అనుబంధం అక్షరాల్లో చెప్పలేనంతటిది.

అశ్రు నివాళితో...

– బైస దేవదాసు.

కావ్యం ఆద్యంతం కన్నీటి భరితం !

అగ్రవర్ణాల ఆధిపత్యం పడగ నీడలో... పడుపు వృత్తి ఒడిలో... నిర్భాగ్యపు బతుకులు వెళ్లదీస్తున్న.. దేవదాసీల కళ్ల నుండి నిశ్శబ్దంగా రాలే కన్నీటి చినుకులను తమ కలంలోకి ఒంపుకుని... "ఎల్లక్క" దీర్ఘకావ్యానికి జీవం పోసిన కవి కెరె జగదీష్ గారు అభినందనీయులు.. స్త్రీలను లైంగికంగా అణచివేయడానికీ, దోపిడీ చేయడా నికీ అమలు చేస్తున్న పితృస్వామ్య సమాజంలోని వ్యభిచార వ్యవస్థను... కాలం వేసిన గాలానికి చిక్కుకుని విలవిలలాడే జీవితాలను... యుగయుగాలుగా నిశ్శబ్ద దుఃఖంలో తడిసిపోతున్న దేవదాసీల దీన స్థితులకు అద్దం పడుతూ కెరె జగదీష్ గారు రూపు దిద్దిన ఈ దీర్ఘకావ్యం ఆద్యంతం కన్నీటి భరితం..! దేవునికి అంకి తమై.. జీవితాంతం.. నరక కూప లో బందీలైన బాధాతప్త హృదయా లతో కాలం వెళ్లదీసే.. అభాగినుల స్థితిగతుల్ని.. ఆర్ద్రంగా అక్షరాల్లో నిక్షిప్తం చేయడంలో కవి జగదీష్ గారు సఫలీకృతులైనారు. కవి జగ దీష్ గారు అనేక సంవత్సరా లుగా పాత్రికేయ రచయితగా సమాజంతో మమేకమై.. తమ దృష్టికి వచ్చిన అనేక అంశాలను ఈ కవితా వస్తువు కు జోడించి.. తమ సృజనాత్మక ప్రతిభతో దీర్ఘకావ్యానికి ప్రాణం పోశారు.. "సముద్రమంత గాయం", "రాతి నిశ్శబ్దం", "రాత్రి సూర్యుడు" వంటి గ్రంథాలతో సాహితీ లోకంలో కవిగా తమకం టూ ఓ ప్రత్యేక స్థానాన్ని పదిల పరుచుకున్న కెరె జగదీష్ గారు.. ఇప్పుడు పాఠక హృదయాలను ద్రవింపజేసేలా దేవదాసీల గాథలను "ఎల్లక్క" పేరుతో దీర్ఘకావ్యాన్ని మనకందిస్తు న్నారు. లోగడ ఆయన రచించిన "రాత్రి సూర్యుడు" పలు భాషల్లోకి అనువదింపబడి... మనసున్న కవిగా ముద్ర వేసుకున్నారు. ఇప్పుడు వెలువరించిన... "ఎల్లక్క" దీర్ఘకావ్యం.. కవిగా ఆయనను మరింత ఉన్నత శిఖరా లకు చేర్చగలదన్న విశ్వాసముంది.

గ్రామ వ్యవస్థలో.. జోగిని, బసివి, మాతంగి తదితర పేర్లతో... వివిధ ప్రాంతాల్లో రకరకాల వ్యవస్థలను ఏర్పాటు చేశారు.. ఊళ్లోని వీధుల్లో పురుషుడి కామ వాంఛలను తీర్చే వేశ్యవాడల సంప్రదాయం నెలకొన్నారు. వేశ్య ఎవరైనా.. కావొచ్చు.. కాని చాలావరకు కొన్ని కులాల వారే లేదా అట్టడుగు వర్గాలకు చెందిన మహిళలే వేశ్యలవడం గమనిస్తున్నాం..

ఒకనాటి నట్టువసాని, నట్టువ మేళం, సాని భోగం, భోగం సానులు.. ఈనాటి కాలంలో సినిమాల్లోనూ ఆ సంస్కృతిని పెంచి పోషించడం.. టీవీ ఛానళ్లు సైతం ఆ దిశలో నడక ఆరంభించడం అత్యంత శోచనీయం..చారిత్రక వాస్తవికతను విస్మరించకుండా. ఆధునిక కాలంలోని దయనీయతను దారంలా చేసి.. 'బసవి' వంటి జీవితాలను అక్షరమాలలో నిక్షిప్తం చేసిన కవి జగదీష్ గారు.. "ఎల్లక్క" పేరుతో దీర్ఘ కావ్యాన్ని పద్దెనిమిది ఖండికలుగా విభజిం చారు. సమాజంలోని ఆచార వ్యవహారాలను.. నమ్మకా లను.. విశ్వాసాలను.. రీతి రివాజులు.. బలవంతాలు.. వంటి వలయాలుగా మార్చి.. 'వెలయాలి' ముద్రతో ఊరేగించే ప్రబుద్ధుల.. పాశవికతను ఈ కావ్యంలో ఎండగట్టారు.. ఊరు ఊరంతా సమూలంగా కలిసి చేసే.. చిత్రవధను.. డబ్బు, దర్పంతో చేసే.. మగ వికృత భావము ఇలా.. బసవిని తమ శరీరంకే దూరం చేసిన వైనాన్ని.. మానవీయ కోణంలో కవి ఆవిష్కరించే యత్నం చేశారు. దీర్ఘకవితకు కావలసిన ప్రమాణాలన్నీ పాటిస్తూ.. కవితా వస్తువు సీక్వెన్స్ దెబ్బతినకుండా పద్దెనిమిది భాగాల్లో సున్నితమైన అంశాలపై.. మరింత సున్నితమైన మనసును జోడించి.. కవి జగదీష్ గారు.. ఈ సామాజిక దురాచారానిపై ఇప్పటికైన అందరు దృష్టి సారించి.. వారి దయనీయ గాథలకు తెరదించాలన్న అర్థం ధ్వనించేలా ఇందలి రచనను కొనసాగించారు. కవితా వస్తువుకు ఎక్కడా సమన్వయం దెబ్బతినకుండా మొత్తం భాగాలను ఆసక్తికరంగా, ఆర్ద్రంగా మలిచారు.

అభివ్యక్తిలో..నవ్యతను పాటిస్తూ.. శిల్పం విషయంలో చతురతతో కూడిన ప్రతిభను జోడించారు. పదబంధ ప్రయోగంలో సంయమనాన్ని పాటిస్తూ.. ఔచిత్యాన్ని ప్రదర్శించారు. మొదటి భాగం నుండి చివరి భాగం వరకు ఓ క్రమాన్ని అనుసరిస్తూ.. సాంప్రదాయ శక్తుల విలాసకేళి గర్భిత ప్రహేళికలో అవిశ్రాంత నృత్య విన్యాసాలతో నిశ్శబ్దంగా నటించే జీవితాల వెనుక దాగివున్న వేదనలను.. అక్షరాల్లో బంధించారు. ఉదయాస్తమయాల ఊపిరిలో జీవితాలన్నో రంగులు మూసుకుని, సుగంధాలతో స్నానమాడుతాయనీ.. రెక్కలు కట్టుకున్న ఐహిక వాసనలు.. ఒక్కొక్కటిగా వాలుతూ.. కాలాతీత చైతన్య ప్రవాహంలో సృష్టి ఆవిర్భావంతో తెర లేపుతాయనీ.. విశ్వవిభుని అంతఃప్రవంతిలో విచ్చుకున్న అందాలు.. నిశినీడలో కాంతిలో శిథిలమవు తుంటాయని కవి వాపోయారు.. కాల చక్రం పరుగులో వీరి, హావభావ విలాసాలు జనరంజకాలై.. సంవన్నుల



హృదయాల్లో వారు బందీలైన తీరుతెన్నులను.. సంపన్న కులీనులు కౌగిళ్లలో కామసూత్రాలు వల్లించిన దేవదాసీల దీన గాథలను ప్రస్తావించిన తీరు బాగుంది. ఆడుకునే వారు లేక.. అభాగ్యులుగా దుఃఖ సాగరాన వారు మునిగి పోయారనీ.. నాగరిక నేలపై అనాగరిక చిరునామాలుగా కనిపిస్తున్నారని కవి తమ బాధను ప్రకటించారు.

విశృంఖల కామతత్వంతో ద్రవించి.. ఘనీభవించిన దేహాలుగా గాయ పడుతూనే ఉన్నాయనీ.. అనాగరిక సమాజం మానవీయతపై తన రాతి పాదాలను మోపిందని ఈ దీర్ఘకవిత ద్వారా కవి విడమరిచి చెప్పారు. రాయి మనిషిగా మారిన నేలపై మనిషి రాయిగా మారడం అమానుషమని వ్యాఖ్యానించారు. చెదరిన మనసుతో.. చెమ్మగిల్లుతున్న ఆ కళ్లలో తీయని స్వప్నాలు ఛిద్రమవుతున్న ఘటనలను కవి అక్షరాల్లో ఆవిష్కృతం చేశారు. గ్రామ పెద్దలు.. మూకుమ్మడిగా తీసుకున్న నిర్ణయానికి తలొంచిన పేదరికాన్ని ఈ కావ్యంలో చూడగలం.. ఇంటిలో నవ్వుల వెలుగులు నింపిన చిన్నారిని చీకటి బాటలోకి నెట్టడం.. దురాచారపు నిప్పుల్లోకి తోసేయడం వంటి దారుణమైన కట్టుబాట్లు ఆధిపత్యంలో అనివార్యమైందన్న సంగతిని కవి కావ్యంలో కవితాత్మకంగా ప్రస్తావించారు. అభం శుభం తెలియని పసితనం అమాయకంగా పసుపు నీళ్లతో తడిసి ముద్దయ్యే సన్నివేశాలను.. అమ్మలక్కల గుసగుసలు.. ముసలమ్మల రుసరుసల మధ్య పూజరయ్య కేకలు.. జోరందుకునే తప్పె ట్ల మోతలు.. జోగమ్మల పాటల మధ్య ఎల్లక్క నడకలు.. ఇలా దురాచార కూపంలోకి లాగే అన్ని దృశ్యాలను ఆర్ద్రంగా చిత్రించారు.

నిట్టూర్పుల రాత్రి, చాలీ చాలని వెలుగుల్లో ఒంటరిగా, ఎల్లక్క మూత పడ్డ కనురెప్పల చాటున చప్పుడు చేయని దుఃఖంలో చిక్కుబడని చీకటిలా వొత్తగిల్లి నిదురబోయే సన్నివేశాలను ఆర్ద్రంగా తీర్చిదిద్దారు.

రాత్రి పగలు నడుమ మగత నిద్రల మనోవేదనలో... తలుపులుండీ.. వెలుతురు లేని ఆవేదన మౌనంగానే చీకట్లో నలుగుతుందని వాపోయారు.

ఆకలి దేహాలు రెక్కలు కట్టుకుని ఆ ముంగిట్లో వాలుతాయనీ.. లోలోపలి నిట్టూర్పుకు బట్టలూడదీసి.. ఆడుతున్న ఆటవిక క్రీడలో.. ఆ దేహం అలసి పోతుందనీ.. వొళ్లు దాచుకోలేని సిగ్గుతో మొగ్గలా ముడుచుకున్న దేహాన్ని వెదురు బద్దలా చీల్చిందనీ.. కవి తమ ఆవేదనను ప్రకటించారు. సహనం కోల్పోయిన శరీరం రాత్రంతా మంచుపూల వర్షంలో తడిసినా.. లోలోన నిప్పుకణికలతో దగ్ధ మవుతూనే ఉంటుందనీ.. ప్రతి రాత్రి ఆకల్ని రాల్చుకుని.. గాయపడిన హృదయానికి కొత్త చిగుర్లు పూసుకోవడం అనివార్యమైన ఘటనలను కవి అక్షరాల్లో అత్యంత ఆవేదనా పూర్వకంగా బంధించారు.

ఆ గడప దగ్గర నిలబడ్డ కాళ్ళు ఆశగా, ఆహ్వానాలు పలుకుతుంటాయి. కళ్లలో చీకటి వర్షం కురుస్తున్నా.. చూపులు అటూ ఇటూ వేలాడుతూనే ఉంటాయి..

చీకటి పడితే చాలు.. తమ రెక్కల అందాల్ని ఆరబోసుకుంటూ అక్కడక్కడ ఈకల్ని జారవిడుచుకుంటాయని వివరించారు.

రంగు రంగుల పూలవనంలో రెక్కలకు పూసుకున్న రంగుల్ని రాల్చుకుంటున్న సీతాకోకచిలుకలు.. కొమ్మనుండి కొమ్మకు వాలుతూ సేదదీరడం.. దయనీయ దృశ్యంగా కంటి ఊచలకు వేలాడుతుందని కవి తమ బాధను ప్రకటించారు. కాచి వడబోసిన వారి జీవితంలో, అంతా తాత్కాలికమేనని తేల్చి చెప్పారు. నడకైనా.. కన్నీళ్లైనా.. పాత చిరునామాలై వర్తమానాన్ని వెక్కిరిస్తాయని పేర్కొన్నారు. ఆకాశానికీ.. భూమికి మధ్య వేలాడే ఆ జీవితాలు రాత్రి పగలు తేడా తెలియక కొత్త ముఖాలు తగిలించుకుని పాత శరీరాల కోరికలు తీర్చే.. తెరలు తొలగించక తప్పదని వివరించారు. నది ప్రవాహం కోసం.. గాయపడి.. బాధపడి వెదుకులాటలో తోడుగా కన్నీటిని పంచు కోవడం.. జ్ఞాపకాలను దాచుకోవడం ఆ జీవితాలకు అనివార్యమైందని వాపోయారు.

భూస్వాముల, కామాంధుల, నయవంచకుల స్వార్థ ప్రయోజనాల మాయాజాలంలో చేస్తున్న హోమంలో ముక్కుపచ్చలారని బిడ్డలు.. యాగ పశువులై పోతున్నారనీ.. జోగిని, మాతంగి, బసవి, మురళి లాంటి ముద్రలు వేశారని కవి తమ బాధను ప్రకటించారు.

జోగు పట్టం.. మైలపట్టం లాంటి ఉత్సవాలు పడుపు వృత్తికి పచ్చజెండా పూపుతున్నాయనీ.. "జోగిని" ముద్రతో.. ఆ అమ్మాయి అందరికీ ఉంపుడుగత్తెగా మారుతుందనీ.. ఈ సామాజిక లైంగిక దోపిడీలో ఉదయాస్తమాలు తేడా తెలియక ఆమె పడే వ్యథలకు అద్దం పడుతూ కవి కావ్యాన్ని కొనసాగించారు. నాటి నుండి నేటిదాకా.. నిర్భయ సాక్షిగా చేస్తున్న లైంగిక దోపిడీ చేస్తున్న నరస్తులు మీసం మెలి వేస్తూనే ఉన్నారని అభిప్రాయ పడ్డారు.

రాత్రి కురిసిన వానలో.. ఏ చినుకు ఆ మొక్కకు ఊపిరి పోసిందో.. ఎల్లక్క ముంగిట్లో.. ఆ మొక్క రెక్కలు విప్పిందని.. తల్లి పాత్రలో ఆలనా పాలనా చేసే క్రమంలో బిడ్డకు.. ఆమెకూ దాపురించే బాలా రిష్టాలను.. తండ్రి తెలియని బతుకులో ఎదురవుతున్న అష్టకష్టాలను ఏకరువు పెట్టారు. నవ్వినా ఏడ్చినా.. ప్రశ్నించే పెదాలకు తండ్రి పేరు చెప్పుకోలేని వ్యథలను గుర్తు చేశారు. బురదలో దించడం సరదాగా మార్చు కొన్న సమాజం.. బురదలో పుట్టిన కమ లాన్ని చూసి.. ముఖాన్ని చిట్లిస్తే ఎలా? ఎలా ప్రశ్నించారు.

ఎదలోని రొద వాకిట.. చీకటి నవ్వడం.. చితిపేర్చిన రాత్రిలో వెన్నెల దుఃఖించడం.. వంటి పదబంధాలతో దీర్ఘకా వ్యానికి తడిని జోడించారు.

శిథిలమైన అవయవాలతో నిర్జీవమైన నిశ్శబ్ద మూలుగులతో ఆ ఎల్లక్క మౌన శిలగా మారే వైనాన్ని.. కాలం కాగితంపై ఎల్లక్క చావుకు మరణపత్రమై రూపు దిద్దుకుంటుందనీ.. ఆ పెదాలపై నిట్టూర్పు నీడలు పల్చబడుతున్నాయని అంటూ కవి ఆర్ద్రమైన భావాలకు దీర్ఘకవితలో చోటు కల్పించారు.

కరిగిపోతున్న కాలప్రవాహంలో.. తరిగిపోతున్న అందాలు ఎల్లమ్మను ఏకాకిని చేసే ఘటనలను చక్కగా పొందుపరిచారు. ఆకలి తీర్చుమని చేతులు జోడిస్తే.. వలువలూడ దీసి.. అందాలకు విలువకట్టిన చేతులు మెడపట్టి గెంటుతున్నాయని ఎండుటాకులా మారిన శరీరాలు మోడైన చెట్టుకింద ఆకలితో నలిగే సన్నివేశాలను కవి దృశ్యమానం చేసిన తీరు అందరినీ కదిలిస్తుంది. దేహం శిథిలమవుతున్నా.. దాహం తీర్చుకునేందుకు.. నదీ తీరాలలో పరుగులు తీయడం.. ఆ బతుకులకు అనివార్యమైన పరిస్థితులను దీర్ఘకావ్యంలో పొందుపరిచారు. ఒంటినిండా కనిపించని గాయాన్ని మోస్తూ.. మూఢాచారాలకు తాకట్టు పెట్టిన బతుకులో రెక్కలిరిగి.. బొక్కలిరిగి.. విరిగి కరిగిన తనువును.. పెచ్చులూడి పుచ్చుపట్టిన దేహం.. శిథిలమైన రోగాల కుప్పగా మిగిలిందని కవి వివరించిన తీరు అందరినీ కదిలిస్తుంది. అందం వున్నంతవరకే ఆమె దేహంపై మోజు.. ఆ అందం దూరమైతే.. ఆ దేహాన్ని తాకడానికే.. మోయడానికి ఆ నలుగురు ఏరీ? అని ప్రశ్నించారు. ప్రతి రాత్రి ఆ అందంలోని అణువణువునూ ఆనందంగా ఆస్వాదించిన క్షణాలను మరిచి.. ఆ దేహం మట్టిలో కలిసిపోయిన వేళ.. చీదరించుకొని దూరంగా అడుగులు వేసే ప్రబుద్ధులను కవి ఎండగట్టారు.

మారుతున్న తరంలో మసక బారుతున్న జీవితాలను ఆదరించే వారేరీ? అని ప్రశ్నించారు.

ఇలా.. ఈ దీర్ఘకవితలో మూఢాచార మురికిలో నలిగిపోయే అభాగ్యులెంత మందో.. బనవిల రూపంలో జీవన సౌందర్యాన్ని కోల్పోయారనీ.. జీవితాలెన్నో ఛిద్రమై పోయాయనీ.. చీకటి వెలుగుల మధ్య బతుకులీడ్చుతున్నాయని కవి తమ ఆవేదనను వ్యక్తపరిచారు.

నా కళ్లలో తడిసిన దీన వదన దేహాలలో ఆ నయనాలు రాల్చిన కన్నీటి ప్రశ్నలు.. నన్ను నిలదీస్తున్నాయంటూ కవి తమ బాధను ప్రకటించారు. కవి.. ఆ కన్నీళ్లనే కలంలో ఒంపుకొని ఈ దీర్ఘకావ్యాన్ని రూపుదిద్దారు. రాతి నిశ్శబ్దంలో కూరుకు పోయిన వ్యవస్థను ప్రక్షాళన చేయాలన్న కవి ఆకాంక్ష అభినందనీయం.

మూగబోయిన సమాజంలో కవి కెరె జగదీష్ గారి అక్షరాలు చైతన్యపు వెలు గులు నింపాలని కోరుకుందాం..

ఇప్పటికైనా చిగురిస్తున్న అనాగరిక కొమ్మల్ని తెగనరికి నాగరిక మొక్కల్ని నాటాలని ఆశిద్దాం.. తరతరాలుగా గాయపడుతున్న బతుకులకు.. ఈ దీర్ఘకవిత చైతన్య దీప్తిని అందించాలని కోరుకుందాం.. అనాదిగా పాతుకుపో యిన దేవదాసీ వ్యవస్థను కూకటి వేర్లతో పెకిళించాలని ఆకాంక్షి ద్దాం.. నయవం చకులు సృష్టించిన అనాగరిక శక్తులపై శక్తి స్వరూపిణులుగా మారి అభాగ్యులు దుష్ట శక్తులను హతమార్చాలని కోరు కుందాం.

ఈ దిశలో దేవదాసీలకు ఓ భరోసా కలిగించేలా.. పాలకుల మనసుల్లో ఈ దురాచారాన్ని రూపుమాపే ఓ ఆలోచన రేకెత్తించే విధంగా కవి కెరె గారు చేసిన కృషి ప్రశంసనీయం. ఆద్యంతం ఆవేద నాభరితంగా కన్నీళ్లద్దుకుని రూపుదిద్దుకున్న ఈ దీర్ఘకవిత సామాజిక చైతన్యానికి దోహదపడగలదని విశ్వసిద్దాం.

పేజీలు : 101, వెల : రూ.100/-
ప్రతులకు : కెరె జగదీష్
9-3-382 (4)
రాజీవ్‌గాంధీ కాలనీ, రాయదుర్గం,
అనంతపురం జిల్లా – 515865.
9440708133

– దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

భల్లం భాష్యం

కవిత్వాన్ని కౌగిలించుకోవడమంటే..

భావనాత్మకమైన రెండు కళ్ల చూపుల్ని ఒకేచోట పాతేసుకుంటే పుట్టిన వర్ణ స్వప్నం కవిత్వమేమో.. అది కాలం కాన్వాస్ మీద ఇంత కన్నా గొప్ప జీవన చిత్రాన్నే గీస్తుంది. ఆ కవితా స్పర్శను అనుభవించినప్పుడల్లా గాయపు పొద్దును, తలపుల తులసిమొక్క ముద్దాడినట్టుటుంది.

మంచి కవిత్వం మట్టి లాంటిది. మట్టి కుండలోనే మంచి నీళ్లు దొరుకుతాయనుకుంటే.. ఆ కుండను ఏ మట్టితో చేశారో కొందరు మాత్రమే చెప్పగలరు. మంచినీళ్లు బావున్నాయని అందరూ అనగలరు. మానవీయ భావాన్వితమైన నీళ్ల కుండ పగిలిపోదు. కుండలోని నీరు, గుండెలోని కన్నీరు మట్టిలోకి ఇంకుతాయి. ఈ తడిమట్టి నుండి ఇంకా ఎన్నో మంచి మంచి కుండలు పుడుతాయి.

ఏ రచనకైనా ఒక సామాజిక సందర్భం అనివార్యం. అది సాంస్కృతిక ఆచరణలో భాగంగా వుండాలి. పైకి తేలికపాటి అలల్లా తేలివచ్చి తాకినా తక్షణం ఒక సాంద్రతర అనుభూతిలోకి, అనుభవంలోకి మంచి కవితా చరణాలు తాకుతూపోతాయి.

సాహిత్య రంగాన్ని ప్రోత్సహించేందుకు అప్పుడప్పుడు కవితా గోష్ఠులు ఒకవేళ నిర్వహించినా, కవుల తప్ప ప్రజలెవరూ హాజరు కావటం లేదు. కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఒకవేళ హాజరైనా కొంత సేపటికే వెళ్ళిపోతున్నారు. "వినదగు నెవ్వరు చెప్పినా– వినసొంపుగా వుంది. కానీ చెప్తే వినే వారే కానరారు. అంతా చెప్పే వాళ్లే– ఆచరణ మాత్రం శూన్యం" ఈ వాక్యాలు ఇటీవల ప్రభుత్వం నిర్వహిస్తున్న కొన్ని సాహిత్య, సాంస్కృతిక సమ్మేళనలకు వర్తిస్తుందేమో ఒక్కసారి ఆలోచిస్తే చాలా మంచిది.

కవిత్వం అంటే ఏమిటో తెలిసినవాళ్లకి చెప్పకపోయినా అంతో కొంతో మరెంతో వాళ్ళకి తెలుసు. ఎటొచ్చీ తెలియకపోయినా తెలుసని తెగనీల్గే వాళ్లకి ఎంత చెప్పినా వాళ్లు తెగ తెలిసినట్లు నటిస్తూ గదమాయింపులూ, బెదరాయింపులకు పాల్పడడం దురదృష్టకరం.

కవిత్వం గురించి మాట్లాడేవాళ్లు కవిత్వం గురించే మాట్లాడతారు. నిలబడనివ్వరు. తొందర పెడతారు. ప్రతీకలతో ఆవేదన ప్రకటిస్తారు. కొత్త వ్యూహాలు రచిస్తారు. గొంతెత్తి నినదిస్తారు. గుండెజెండా ఎగరేస్తారు. కవిత్వం గురించి ఒకటే ప్రసంగిస్తారు. వాళ్లు కవిత్వంలో పీక లోతు కూరుకుపోతారు. దేహంతో మనసుతో సర్వేంద్రియాలతో సదా కవితా రచన కోసం సన్నద్ధంగా వుంటారు. అందుకే సీరియస్‌గా సిన్సియర్‌గా కవిత్వం రాసేవాళ్ల సంగతి వేరు.

> కవిత్వమే జీవితానందంగా స్ఫురించడమంటే ఇంటినీ, చెట్లనీ, మట్టినీ, మసిలిన గ్రామాన్నీ ఉన్నదున్నట్లుగా ప్రేమించడమన్న మాట.

కవికి కవిత్వం ఒట్టి కవిత్వంగా కాక ఆనందంగా అనుభవమవుతుంది. అన్ని వాదాల్ని, తర్కాన్ని, శాస్త్రాన్ని, నిర్మాణాల్ని, మించిన మహానుభవంగా జీవితాన్ని దాని సారాంశమంతటితోనూ కవి మాత్రమే అందుకోగలడు. ఎవరో నిర్వచించిన స్వకీయ నైతిక సూత్రాన్ని కవి అంగీకరించక్కర్లేదు. ప్రతి కవి స్వప్రయోజనమూ ఆనందమే పరమావధిగా బతుకుతుంటాడు.

కాలానికీ కవిత్వానికీ సంబంధం తెగిపోవడం గమనించి ఆ తెగిపోయిన సంబంధాన్ని మళ్ళీ కలపడం సుకవి చేసే పని. అటువంటి బంధం ఇప్పుడున్నంత దారుణంగా తెగిపోవడానికి చాలా మంది కృషి నిక్షిప్తమైవుంది. అందులో ఏమీ తెలియక అచ్చులో దొరికిన ప్రతిదీ నిజమనుకుని భ్రమించే కొంత మంది కవులకు మినహాయింపు లేదు.

సుకవికి జీవద్భాషతో పాటు, మాండలిక పదజాలం తనదైన వస్తు నేపథ్యంలోంచి వస్తుంది. దీనితో పాటు విస్తృత అధ్యయనం, నిరంతర సాధన అత్యవసరం. దాంతో అవగాహనాశక్తి పెరిగి, ఆలోచనా సరళి లోతుగా విస్తరించి, కవిత్వ రచన తేలికగా తెలివిగా పట్టుబడుతుంది.

ఓ సూత్రానికి స్థిరంగా కట్టుబడకుండా, అంతర దొంతరల ఆసరాతో విభజించి పాలించే నియంత్రిత వ్యవస్థలకు తలొగ్గకుండా, తన స్వ ఇచ్ఛను కాపాడుకుంటూ అప్రమత్తతా కొందరు కవులు ఉంటారు. అటువంటి వారు ఉన్నది ఉన్నట్టు చూడగలరు. రాయగలరు. సిద్ధాంతాల్లో ఆచరణలో లోపాల్ని పసిగట్టి, బలవంతపు అణచివేతకు తావులేని విధంగా జీవించేందుకు కవిత్వంలో గట్టి ప్రయత్నం చేస్తారు.

కవిత్వం ఉద్యమాల్ని సృష్టించదు. ఉద్యమాలే కవిత్వాన్ని సృష్టిస్తాయి. ఉద్యమాలు ఉద్భవించడానికి గల కారణాలను సమాజంలోనే వెతుక్కోవాలి. అలాగే కవిత్వ సంకలనాలు చరిత్ర గతుల్ని మార్చలేవు. ఆ మాటకొస్తే చరిత్రగతుల్ని బట్టే కవిత్వ సంకలనాలు ఉద్భవిస్తాయి.

జీవితం పట్ల ప్రేమ, సమాజంపట్ల గౌరవం, భవిష్యత్తు పట్ల విశ్వాసం ప్రేరేపించ గలిగేదే గొప్ప కవిత్వం. అది మనిషి పట్టుకను, జీవితాన్ని పూయించడానికి బ్రతుకును పరిమళింపచేస్తుంది.

కవి ఒక్కోసారి తన స్వభావాన్ని తాను పూర్తిగా కోల్పోవటం ద్వారా తనపై తాను అనేక ప్రయోగాలు చేసుకోవడం ద్వారా మాత్రమే కవిత్వీకరణ చేయగలగుతాడు. అంటే కవిత్వం రాస్తున్నంత సేపూ తన నుంచి తాను పూర్తిగా దూరం అవుతాడు. కవిత్వ సృష్టికోసం మనఃపూర్వకంగా పొందే పరాయీకరణగా చెప్పుకోవచ్చు.

కొంతమంది కవులు కవిత్వం రాయడం, ఏదో విధంగా అచ్చులో చూసుకోవడం– ఆలస్యం– వాట్సప్‌ల్లోనో, ఎస్.ఎం.ఎస్‌ల ద్వారానో అభిమానుల మీదకో అమాయక పాఠకలోకం మీదకో, వదలడమో తద్వారా లభించే మోమాటపు అభినందనలకూ, పొగడ్తలకు ఉప్పొంగి, పుస్తక రూపంలో అచ్చువేయడానికి ఎంత మాత్రం ఆలశ్యం చేయపోవడం మిగుల ఆశ్చర్యకరం.

ఇటువంటి వారు ముందుగా కవిత్వం సమాజానికి ఎలా దగ్గరవుతుంది? సమాజాన్ని తనలో ఇముడ్చుకునే కవిత్వాన్ని కొద్దో గొప్పో చదవడం, మనో నేత్రంలో ఆ వాస్తవ వాతావరణాన్ని దర్శించడం. వివేచనతో విశ్లేషించుకున్నప్పుడు కదా వారు మంచి కవులుగా ఎదగగలరని అర్థం చేసుకోవాలి.

కొందరేమో కవిత్వాన్ని కావాలనే సంక్లిష్టం చేస్తారు. భాషని చిందర వందర చేస్తారు. వాక్యాన్ని విరగ్గొడ్తారు. గజిబిజి గందరగోళం సృష్టిస్తారు. అరిగిపోయిన పదాల్ని పదబంధాల్ని అవతల పారేసి కొందరు సరికొత్త పదాన్ని పదబందాల్ని సృజిస్తారు. ప్రపంచీకరణ దుష్పరిణామాలపై వర్తమాన కవులు అద్భుతంగా స్పందిస్తున్నారు. గతంకంటే గొప్పగానే వస్తు శిల్పాల ఎంపికలో ముందు చూపును సృజనాత్మకతను ప్రదర్శిస్తున్నారు.

కవిత్వమే జీవితానందంగా స్ఫురించడమంటే ఇంటినీ, చెట్లనీ, మట్టినీ, మసిలిన గ్రామాన్నీ ఉన్నదున్నట్లుగా ప్రేమించడమన్న మాట. జీవించే ప్రతి క్షణమూ తారసపడే ప్రతి మనిషీ, పలికే ప్రతి మాటా ఒక "సెలిబ్రేషన్" కావడమన్న మాట.

అది అప్పుడు అచ్చమైన.. స్వచ్ఛమైన కవిత్వం అవుతుంది.

–ఎస్.ఆర్.భల్లం
సెల్: 9885442642

పరదాలు

మావిపొర చించుకొని భూమ్మీద పడ్డ క్షణం నుండి
మనిషిని ముసుగేసే మాయా పరదాలే అన్నీ
బాల్యంలో మనసు ఉంటుందీ స్వచ్ఛమైన మంచులా
ఎదిగిన కొద్దీ ఈర్ష్యాద్వేషాల కల్మషమే నిండిపోగా..
మనుషుల అనుబంధాలను కూలదోసే అపార్థాల పొరలు..

సమాజంలో స్థితిగతుల అంతరాలు కులమత విబేధాలు
అధిపత్యపు పోరులో దేశాల మధ్య సరిహద్దులు
జాతివివక్ష వర్ణబేధాలు
సర్వమానవ సౌభ్రాతృత్వానికి అడ్డుగోడలైనాయి!

మనసులోని మదమత్సరాల తెరతీయగరాదా అంటూ
అద్భుత భావాన్ని త్యాగయ్య కీర్తనలో చెప్పినట్లు
ఒకరికొకరు ఒదుగుతూనే
అస్థిత్వాన్ని నిలుపుకొమ్మని సూచిస్తూ..
చూపులు కలిసె కళ్యాణశుభవేళ తొలగే అడ్డుతెరల
చీకటి జవనికను తొలగించి వచ్చే వేకువకళలా
మబ్బులని దాటుకుని వచ్చిన చంద్రుని వెన్నెలలా
అహం వీడి అంతరంగాన్ని శోధించి ఆత్మసౌందర్యంతో
అసలైన మానవత్వం మెరవాలి మేలిమి బంగారంలా..!!

– విజయ రామగిరి
9949043229

సాంత్వన

ఎందుకో.. ఏమో!
భూమికి ఉన్నంత సహనం, శక్తి
భగవంతుడు మగువకు
మాత్రమే ఇచ్చాడు
ఈ నిజం లోకానికి అర్థమయ్యేది ఎలా..?
ఆమె తోడుగా ఉంటే..
మగవాడు ఎంతకైనా చూపిస్తాడు తెగువ!
ఒక అమ్మగా, అక్కగా, చెల్లిగా, ఇల్లాలిగా
ప్రతి మగవాడి జీవితంలో..
తన పాత్రను ముడివేసుకుంది మగువ!
ఎత్తు, పల్లాలు, కష్టం, సుఖం
లెక్కించగలం కొలతలతో సహా కానీ
మగువ మనసు అర్థం చేసుకోగలమా..?
ఆమె గొప్పతనం విప్పి చెప్ప సాధ్యమా!
ఏమి ఉన్నా, లేకపోయినా..
కట్టుకున్న భార్య, కన్న కూతురు లేని
ఆ ఇల్లు అడవి కాచిన వెన్నెల చందమే!
మన జీవితంలో మగువ స్థానం ఏదో
తెలియని మనిషి ఉన్నాడా..?
ఒకవేళ ఉంటే.. అతడు మనిషే కాదు
మగువేగా మగవానికి హృదయ సాంత్వన..!

– దేవానంద్ నాగెల్ల

నేను కురుక్షేత్రంలో కిరీటిని

పరీక్ష అంటే భయం
పరీక్షలో ఉత్తీర్ణుడనౌతానో లేదో అని భయం
అందుకే ఇంతకాలం
పరీక్ష రాయకుండా ఉన్నాను.
తక్కువ మార్కులు వస్తాయేమోనని భయం.
ప్రక్కవారేమైనా అనుకుంటారని భయం
సంవత్సరమంతా చదివిన నాకు
పరీక్ష సమీపించగానే భయం
ఎక్కడి నుంచి వచ్చిందో ఈ పిరికితనం
తరగతి గదిలో అందరూనన్నే మెచ్చుకున్నారు
తక్కిన వారికన్నా ఎక్కువ మార్కులొస్తాయన్నారు
అప్పటి దాకా జ

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 158వ రోజు 'ఆవకాయ' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. 'ఆవకాయ' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.. – సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం ఏకాంశ కవిత్వం నిర్వహణ:
డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

అంధ్రుల పుట్టింటి పచ్చడి

ఆంధ్రుల పాక
ప్రావీణ్యతకు తార్కాణం
అమ్మ ప్రేమ పొందని మనిషి లేడు
ఆవకాయ రుచి చూడని
తెలుగు వాడు లేడు.
నోరూరిస్తూ రుచిని తెప్పించే ఊరగాయ
మసాలా మేళవింపుతో
మమకారాలను పంచే ఆవకాయ.
చూడగానే నోట్లో నాలుక సయ్యాట
పసందైన వంటకాలు ఎన్నున్నా
పచ్చడి లేని భోజనం వృధా.
మనుషులతో పాటే
దేశాలు దాటిన వంటింటి సహచరి
కంచనీ నిండిన పండుగ రోజు అయినా
కూరలు నిండు కొన్న దండగ రోజైనా
ఆవకాయకు లేదు మినహాయింపు.
ఆవకాయ పెరుగన్నం
ఆవకాయ నెయ్యి
ఆవకాయ చప్పటి పప్పు
దేనితోనైనా కలిసిపోయే
సార్వజనీన పట్టపు రాణి.
ఆంధ్రుల జీవితాలతో
పెనవేసుకున్న పాక రత్నమా
నిన్ను తలుచుకుంటే
నోట్లో జల జల పొంగు
రుచుల ఊట.

-త్రివిక్రమశర్మ,
90003 92707

జై ఆవకాయ !

ఆవకాయని
ఏవగించుకునేదెవరు ?
నిన్న మొన్న
అన్నప్రాశనైన
చిన్ని గాడి నుండి
ఆవకాయ జాడీ చుస్తే
లొట్టలేయనిదెవరు!.
ప్రకృతి లోని పంచభూతాలు
దోర మామిడిగా
చుర్రు మనే ఎర్ర కారంగా
వగరు ఆవపిండిగా
నూరని కల్లుప్పుగా
గానుగ నువ్వు నూనెగా మారి
అన్నీ కలగలసి
ఆవకాయగా
మనల్ని పిచ్చివాళ్లను చేయవే !.
వేడి వేడి నీరన్నాన్ని
ఆవకాయతో కలిసి
గుటకలేస్తు తింటుంటే
పంచభూతాలప్రసాదం
కడుపులో పంచామృతంగా జారుతుంటే
జై ఆవ కాయ !
జై జై ఆవకాయ ! !
అని నినదించని
తెలుగు నోరు ఉంటుందా?
సందేహమే !.

-రామకృష్ణ చంద్రమౌళి,
9666656687

నోరూరించే ఆవకాయ

అబ్బబ్బబ్బా ఆవకాయ్ !
నోరూరించే ఆవకాయ్ !!
ఆవకాయ్ అనగానే
లాలాజలం ఊరే ఆవకాయ్!!
ఓపికున్నమ్మ చేసే ఎన్నో
రక రకాల ఆవకాయ్!!!!.
ముక్కల ఆవకాయ్
తొక్కుడు ఆవకాయ్
మాగాయ్
మెంతి ఆవకాయ్
పెసర ఆవకాయ్
వెల్లుల్లి ఆవకాయ్
సెనగఆవకాయ్ !!
అబ్బబ్బబ్బా ఆవకాయ్!
నోరూరించి లాలాజలం పెంచే
ఆవకాయ్!!
పప్పులో ఎర్రగా ఆవకాయ్
అప్పుడే కాచిన
ఘుమాయించే నెయ్యిని కలిపి
ముద్ద ముద్ద కు నెయ్యి వేసుకుని
తింటే ఉంటుంది మజా!
మరువలేని ఆవకాయ్
ముద్ద సాక్షిగా నిజం
అనాది నుండి కవులు సృష్టించారు
ఎన్నో పద్యాలు
ఆవకాయ్ సాక్షిగా!
వంటింట్లోకి వెళ్ళి వెళ్ళగానే
ఘుమాయించే ఆవకాయ వాసన
అప్పటికప్పుడు
పట్టెడన్నం పళ్లెంలో పెట్టుకుని
పేరు నెయ్యి, వెన్న వేసుకుని తింటుంటే
స్వర్గం బెత్తెడు దూరంలో...
చద్దన్నమూ గడ్డ పెరుగూ
ఆవకాయ్ ముక్క కలిపికొట్టు
ఎవరికైనా నచ్చకపోతే ఒట్టు
నాలుక కుతితీరని ఆవకాయ్ ముక్క
కడిగి నోట్లో బుగ్గన పెట్టుకుని
ఊరించుకుంటూ తింటుంటే
ఉంటుంది మజా!
అబ్బబ్బబ్బా ఆవకాయ్
నోరూరించే ఆవకాయ్!!
పదహారణాల ఆంధ్రుల ఆవకాయ్!!
ఆవకాయ్ బిర్యానీ
విదేశాలకు ప్రయాణం చేసే ఆవకాయ్!!
ప్రపంచాన్ని చుట్టి వచ్చే ఆవకాయ్!!
తరతరాల రుచుల పచ్చడి ఆవకాయ్!!!
జిందాబాద్!!

-మన్నె పిన్నక లలిత,
741 686 32 89.

జనమ సార్థకమ్ము..

ఆ.వె. ఆవ కాయ పేరు ననగానె నాలుక
రసములూరు రుచుల రాజసమ్ము
జనమ సార్థకమ్ము చైతన్యమై దివి
మనసు లోన గాంచమావి తృప్తి!!.
ఆ.వె. బెల్లపావచెక్కు ప్రేమతో నూగాయ
కసరుపిందె తొక్కలసలురసము
ఎండకాలమందు దండిగా నూనెతో
తిన్న కొద్ది పోవు వెన్నముద్ద!!.
కం. సర్రునకారములుప్పును
ఎర్రనిపొడికారముతో నింగును రుచియై
కుర్రతనంపున చేతన
మర్రావుల చాచునావ మందగసతమున్!!.
ఉ.మామిడిదోసకాయలను మన్ననగుమ్మడిదొండజాతులున్
ప్రేమలనావకాయలను పితృవిశేషపు పచ్చడిన్ రుచిన్
ధామములందు పోపులను దట్టమునింపెడు పచ్చడుల్ సదా
సీమలకొక్కరీతిగను చెర్చెదరెప్పుడు తెల్గు వంటలన్!!.

-మాడుగుల నారాయణమూర్తి,
94411 39106

మాటల్లో పలుకలేని మౌనగీతిక

ఉగాది రాకుండానే కోయిల కూసింది
మామిడి రాకుండానే
దర్పణం ఆవకాయ రుచి చూస్తా
అంటోంది.
విశ్వనాథ సత్యనారాయణ కత్తిపీట
మామిడి కాయలు తరిగే ఫోటో
మెదులుతోంది
అందుకే దర్పణం కలాలు కలిపే
ఆవకాయ రుచి కావాలంటోంది.
ఎర్ర ఎర్రగా
ఆవపిండిఘాటుతో
జాడీలనిండా నూనె నదిలో
తేలిపోతూ కనువిందు చేసే
అందమైన బొమ్మ ఆవముక్క
పిల్లలు మొదలు తాతల దాకా
లొట్టలేస్తుంటే
ఇంకా ఊరాలి
అప్పుడే
ఆహా ఏమిరుచి
అంటారు మైమరచి
ముద్దపప్పు నెయ్యితో
ముక్క ఆవకాయ
ముక్కు పుటాలను అదరగొట్టింది
గుంటూరు ఆవకాయ గూబగుయ్
గోదావరిది తీపి పులుపు
కోరిన రుచులతో
ఇంకా వెయ్ కంచంలో అంటుంది
కొత్త ఆవకాయ రుచి
రచనని అచ్చులో చూస్తే కలిగే ఆనందం
మాటల్లో పలుకలేని మౌనగీతిక.

- ఎ.రాజ్యశ్రీ,
93908 64067

మామిడికాయ తొక్కు

ఆవకాయ తెలుగువారి హక్కు
అది తింటే విడువని తొక్కు
ఆవకాయ పప్పు అమోఘం
రుచి చూస్తే విడువరు ఎవరూ!.
అమ్మ అయినా
అమ్మమ్మ అయినా
ఆవకాయ చేసి పెడితే
యాడాదైనా
ఆవురావురంటూ తింటాం
నంచుకున్నా చాలు
నోరూరించి ఆకలి పెంచే మందు
ఆవకాయ వుంటే చాలు
అన్ని కూరలున్నట్టే.
అప్పుడు
నాటి మనుషులు
ఆవకాయ పెరుగుంటే తిని
ఆకలి తీర్చుకున్నారు
శతకానికి చేరారు
ఇప్పుడేమో
ఆవకాయలో ఉప్పు ఎక్కువ
ముప్పు అంటున్నారు
అదేమో ..
మారింది –
మనుషులా? జీవనశైలా?
ఆహార నాణ్యత తగ్గిందా?
క్రిమి మందులెక్కువయ్యాయా?
ఆవకాయ ఆంధ్రుల ప్రత్యేకత
అది తెలుగు వారి పేటెంట్
ఆవకాయలో వున్నాయ్
ఆవాలు అంటాక్సిడెంట్స్
రుచిలో మిన్న
వెన్న వేసుకుంటే నలభీమ పాకమే
ఆవకాయ పచ్చడి ఖండఖండాలు దాటి
వలస బాటపట్టి
అమెరికా అభివృద్ధి దేశాల్లో
తెలుగు వారి పేరు మోగించింది.
ఆవకాయ అందరికీ ఇష్టం
ఉండని ఇల్లు లేదంటే అతిశయోక్తి కాదు
ఇంట్లో ఏమి లేనప్పుడు
కరోనా కాలంలో ఆదుకున్న
ఆపద్బాంధవి ఆవకాయ
స్వయం నిల్వ దానికే స్వంతం.

-డా. భూంపల్లి కేశవరెడ్డి,
98484 73099

అమ్మా- ఆవకాయ

ఆవకాయ!...
ఆహా!
శుచికి!
నాలుక రుచికి!
వంట్లో వేడికి!
వేడి అన్నంలోకి!
నేతి చుక్క కలిపి!
తింటే భోజనం!
మహా భోగం!!.
చిన్నతనం!
వదలని జ్ఞాపకం!
మరువని రుచి శాకం!
బడిగంటకి!
ఆవకాయ బద్దకి!
ఆవురుమంటూ
తినే ముద్దకి!
విడలేని బంధం!
ఆకలికి మోక్షం!!
పిజ్జా గుజ్జు!
ఫాస్టు ఫుడ్డు నుజ్జు!
ఆరోగ్యానికి వదలని
బూజు!!
పిల్లలంతా కూడి!
అమ్మ చుట్టూ చేరి!
పెద్ద కంచం!
ఎర్రని అవకాయ కారం!
అమ్మ చేతి ముద్దకై
పోటీ పడుతూ!
ఆవకాయ రుచి ఆస్వాదిస్తూ!
బాల్యం! ఆవకాయ జ్ఞాపకం!
మరువలేను!..
ఆ!.. రుచి వదలలేను!!
ఆహా! ఏమి రుచి!
తినరా మైమరచి!!..

-జె.నరసింహ రావు,
9490128690

తెలుగు ఆవకాయ

పండ్లలో రారాజు మామిడి
పచ్చళ్ళలో రారాజు మామిడి పచ్చడి!
కాయ ఒక్కటే
పచ్చళ్ళు ఎన్నోరకాలు
ఎన్నోరుచులు
రుచికోపేరు!
ఆవకాయ, మాగాయ, మెంతికాయ
పెసరకాయ, నువ్వుకాయ
అన్నిట్లోకి రారాజు ఆవకాయ..
ఆవకాయ పేరువింటేనే నోరూరి
దానిరుచి నోట్లోకి వచ్చేస్తుంది మరి!
ఎన్నోదినుసుల సమ్మేళనం ఆవకాయ
ఎన్నోరుచుల సమ్మేళనం ఆవకాయ
పులుపు, ఉప్పు, కారం, ఆవఘాటు
వెల్లుల్లి ఘుమ ఘుమలకి తోడు
నిల్వవుండటానికి ప్రశస్తమైన నువ్వుల
నూనె!
ఆవకాయలేని ఇల్లుండదు!
అమ్మలేని ఇల్లుండదు
అమ్మచేత్తో కలిపిన
ఆవకాయ అన్నం ముద్ద తినని
తెలుగు బిడ్డ ఉండదు!.
ఉదయం టిఫిన్లు లేని రోజుల్లో
పెరుగు, చద్దిఅన్నం తో
ఆవకాయముక్కే టిఫిన్!
'ఆవకాయ అన్నం బావుంటుందిరా
తిను నాన్నా!' అంటున్నబామ్మ
'వద్దు బామ్మా! కారం' అంటున్న మనవడు!
ఏమి అర్భకం వెధవలో!
వాడి నాన్న రోజూ చద్దన్నం
ఆవకాయతో తిని
బడికి వెళ్ళే వాడు!.

-మోటూరి శాంతకుమారి,
8106790978

ఖండాంతర ఖ్యాతి

నాలుకపై రుచి మొగ్గలకు పనిచెప్పే
ఆంధ్రుల అభిమానపచ్చడి ఆవకాయ!
వేసవిలో లాభం ఆవకాయ, మామిడిపళ్ళు!.
కోయిలపాట వింటూ కొమ్మల పూతతో
వేపచెట్ల చల్లగాలిలో వేగంగా కాపు మామిడి!
వడ పిందెలు ఉప్పూకారం బాల్యపురుచి!.
గుంటూరు కొత్తకారం, ఆవపొడితోనే
ఉప్పూ పల్లీనూనె కలిపిన ఆవకాయయజ్ఞం !
ఇంటిల్ల పాదికీ బోలెడు హడావిడి!.
టెంకపట్టిన పీచుమామిడి కాయలనే
ఆవకాయకు దివ్యమైన ముడిసరుకు!
తినేసత్తాను బట్టీకారం, దినుసులు!.
సుకుమారులైతే బెల్లం ఆవకాయతో
వేడిఅన్నం ఒకపట్టు పట్టేస్తారు!
జాడీలకెక్కిన ఆవకాయ అటకపైకొలువు!.
ముక్కలుకొట్టే కత్తిపీట మహారాణిలా
చాపమీద ముక్కల్లో జీడితీసేది పిల్లమూక!
పచ్చడికలిపిన పళ్లెంలోనెయ్యి అన్నంతలో
ముద్ద!.
జానెడుసీసాల్లో బోలెడురేటెట్టి కొనగానే
రుచిలేని వైనంచూసి సొంతఆవకాయ!
ఆవశ్యకత తెల్పుకునే మధ్యతరగతిప్రాణులు!.
ఉసిరి,మాగాయ,పులిహోరగోంగూరతో
పప్పుదప్పళం వడియాలు
ఫక్తు తెలుగుభోజనం!
.ఖండాలు దాటినకీర్తి
ఆవకాయ మహాఆర్తి!.

- ఎం. వి. ఉమాదేవి,
78423 68534

ఆవకాయ

చెట్టు మీద కాయను
సముద్రం లో ని ఉప్పును కలిపి
కారం నూనె తో
నోట్లోని జ్ఞానేంద్రియాన్ని తట్టిలేపే
మధురమైన తేనెలూరే పచ్చడి
ఆవకాయ
ఆవకాయ అనగానే
అమ్మమ్మ గారి ఇల్లు
గుర్తు రానివారు బహుశా ఉండరేమో
ఎండవేడిమి సాయంత్రం
ఆరు బయట ఆవకాయ ముద్దలేస్తూ
అమ్మమ్మ ప్రేమ
చిన్ననాటి మధురస్మృతులను
తట్టిలేపిన ఆవకాయ పచ్చడి
నీకు జోహార్లు
ఆవకాయ కు
అనుబంధానికి
అవినాభావ సంబంధం
అతిమధురం
ఆనాటి జీవనశైలి
ఆనందాలకేళి.

-ఆర్.కళ్యాణి,
99128 98029

నేటి నిజం

-చాపల మహేందర్
9949864152

అందుబాటులోకి వ్యాక్సిన్ వచ్చింది కరోనా కు కళ్లెం వేసింది.

వ్యాక్సిన్ మీద అపోహ అసలే వద్దు ఆనందంగా టీకా వేసుకో.

కరోనా వ్యాక్సిన్ సురక్షితమే టీకాతో ఆయుష్షును పెంచుకో.

వ్యాక్సిన్ నమ్మి వేసుకుందాం కరోనా రోగాన్ని తరిమికొడదాం.

వ్యాక్సిన్ తీసుకుంటే కరోనా మహమ్మారిని నిలువరిస్తుంది

పతనం అంచున మా'నవ' నడక....!

డిజిటల్ యుగపు రోబోలు
వైరస్ పట్టిన నర సాఫ్ట్‌వేర్‌లు
అర్థం పర్థం లేని ఆరాటాలు
గమ్యమెరుగని గత్తర పరుగులు
ఆద్యంతమే లేని ధనదాహాలు
నైతికత ఇంకిన మర మనుషులు !.
అశ్లీలతను ఆరాదించే నేత్రాలు
అబద్ధాలు ఆస్వాదించే చెవులు
ముళ్ళను తలపించే స్పర్శలు
నరమే లేని నాలుక నర్తనలు
కంపుకొట్టే కపట దుర్గంధాలు
పతనం అంచున పంచేంద్రియాలు !.
విచక్షణ మరిచిన దురాలోచనలు
దురాశలతో వేలాడే ఊడలు
మర్యాదల వెనుక మతలబులు
ఈర్ష్యలు నిండిన ఇకమతులు
ఇరుగు పొరుగంతా పరలోకులు
చేయూతలు తరిగిన చేతులు !.
బంధాలన్నీ వ్యాపార వస్తువులు
స్నేహాలన్నీ తేనె పూసిన కత్తులు
విత్తం వెంట వేలం వెర్రి పయనాలు
నరుల తోలు తొడిగిన గుంట నక్కలు
నవ్వుల వెనుక ప్రతీకార జ్వాలలు
హితపరుల వేషంలో అసురులు !.
అంతర్జాల సాగరమథనాలు
సాధించాలి స్మార్ట్ ఆణిముత్యాలు
నిర్మించాలి ప్రేమల పొదరిల్లు
చేరాలి ఆనందపు అంచులు
వికసించాలి నవ్వుల పువ్వులు
పరిమళించాలి వసుదైక కుటుంబాలు !
చిగురించాలి మానవీయతలు
నాటాలి ఆంటీవైరస్‌ల విత్తులు
కూల్చాలి అవాంఛనీయ గోడలు
విలువలతో వర్ధిల్లాలి ఆత్మీయతలు
ఇంటర్‌నెట్' అల్లాలి అనుబంధాలు
నరులు కావాలి నారాయణులు !

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

కలల కంచె

చరిత్ర గుమ్మాల ముందు
వేలాడుతున్న జీవిత చరిత్ర పరదాను
పొరలు,పొరలుగా తెరిచి చూసినప్పుడు
అలికిడి లేని ఆవేదనలే తడిగా కనిపిస్తాయి
ఆ పచ్చదనపు వాసనను పోగొట్టాలని
చప్పుడు చేస్తూ పరిగెడదాం అనుకుంటాను
రాతి మనసు కలవారెవరో
ఇనుప పగ్గాలతో
సంకెళ్ళేసి లాగుతారు అని తెలియక
నేను ఎన్నిసార్లు
కొత్త రెక్కలు అతికించుకొని ఎగరాలనుకున్నా
ఈ పితృస్వామ్యం నా రెక్కలను కత్తిరిస్తూనే ఉంది
కలకని,కలకని
తలదిండు కింద పళ్ళు బిగించి
కన్నీళ్లతో కళ్లు మూసుకుంటాను
మళ్ళీ ఎప్పుడు కలకనకూడదని
పోరాడి,పోరాడి అలసిన దేహం మీద
వలసగా వాలిన కొన్ని ఆలోచనలు
అసలు నువ్వు ఎవరు అంటూ
నన్ను నన్నుగా ఉండనివ్వదు
ఇప్పుడు నాకై నా ఆలోచన
అక్కడ కూడా నన్ను నేను వెతుక్కోనివ్వకుండా
ముసురుగా కురుస్తున్న అహంకారపు వర్షం
ఇంకెప్పటికీ ఆగదని తెలిసి
మళ్లీ కాళ్లు మడిచి కల కంటాను
కలత నిద్రలోని కన్నీళ్లే బాగున్నాయని
అక్కడే మళ్ళీ రెక్కలు కట్టుకొని ఎగరొచ్చని
ఇంకెప్పుడైనా కావలనిపించింది రాదని తెలిస్తే కలలోనే
వచ్చిందనుకుంటాను
కట్టె కాలే వరకు కలల రెక్కలు కట్టుకొని
ఊరేగుతుంటాను ఇప్పుడు
నా జీవితాన్ని కూడా
ఒక కలా అనుకుంటాను..

-పి.సుష్మ
9959705519

సమయాస్ఫూర్తితో కదలాలి

నేటి ఆధునిక సమాజంలో బాలికలపై , యువతులపై , వివాహితలపై జరుగుతున్న అత్యాచారాలను చూసి మనసు ద్రవించిపోతుంది. దిశ చట్టాలు ఎన్ని వచ్చినా కూడా భయం లేకుండా అరాచకాలకు , ఆటవిక చర్యలకు పాల్పడుతున్న మృగాలు తీరు మారడం లేదు. కుటుంబం నుంచే సంస్కృతి సాంప్రదాయాలను నేర్పించి అక్కాచెల్లెళ్ల అను బంధాలను తెలుపుతూ బలోపేతం చేయాలి. తల్లిదండ్రులు గురుతర బాధ్యత తీసుకొని తమ కొడుకులు ఎక్కడ తిరుగు తున్నారు ఎక్కడికి వెళుతున్నారు ఎక్కడి నుంచి వస్తున్నారు అని ఒక కంట కనిపెడుతూ వారికి విద్యాబుద్ధులు నేర్పాల్సిన బాధ్యత వారికి ఉండాలి. ఆధునిక సమాజంలో ఆటవిక రాజ్యాన్ని అంతం చేయాలి .తాను అనుకున్నది సాధించాలనే తపనతో తమ తల్లి కూడా ఒక స్త్రీ అని మరచిపోతూ హింసా ప్రవృత్తికి పూనుకుంటున్నారు. నేటి యువత నుంచి వృద్ధాప్యంలో కొట్టుమిట్టాడుతున్న ముసలి వాళ్లు సైతం కూడా పసిమొగ్గల పైన పశువాంచను తీర్చుకుంటూ, అరాచకత్వాన్నికి పాల్పడడం సిగ్గుచేటు. తరతరాలుగా మహిళలు ఎదుర్కొంటున్న అవమానాలను, హింసా ధోరణులను, వంటింటి హత్యలను, లైంగిక దాడులను అరికట్టాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరికీ ఉండాలి. లేకపోతే రేపు ఇటువంటి ఘోరాలు మనింట్లో నే జరగడానికి అవకాశం ఉంటుంది. ఇంటి నుంచే బిడ్డల్ని బలోపేతం చేయాలి .తెలియని వ్యక్తుల నుంచి మనం ఎంత ప్రమాదం లో పడతామో, తెలిసిన వ్యక్తుల నుంచి కూడా అంత కన్నా ఎక్కువ ప్రమాదాలు ఎదురవు తాయని తెలియజేయాలి .బయటికి వెళ్ళిన బిడ్డలు మళ్ళీ ఇంటికి తిరిగి వచ్చే వరకు కూడా మనం సందేహంతో ఎదురుచూస్తూనే ఉంటాము. ప్రాథమిక తరగతి నుంచి స్త్రీ విద్యను ప్రవేశపెట్టాలి. ఆత్మ రక్షణ కొరకై తరగతులు నిర్వహించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ధైర్యాన్ని కోల్పోకుండా మనోధైర్యాన్ని మనసులో నింపాలి. శారీరక బలం లేకున్నా, మానసికంగా దృఢంగా తయారు చేయాలి. ప్రతి విషయాన్ని కూడా దాచి పెట్టకుండా కుటుంబంతో చర్చించాలి. అవసరమైతే పోలీసులకు చెప్పడానికి కూడా అవమానకరంగా మనం ఫీల్ కాకుండా ఫిర్యాదులు చేయాలి. అప్పుడు సత్ఫలితాలు రావచ్చు. ఇంకొకరు కూడా తప్పు చేయడానికి, భయపడడానికి అవకాశం ఉంటుంది. తప్పు చేసే వారిలో మార్పు కూడా రావచ్చు. ఏదేమైనా తమ స్వశక్తితో , సమయస్ఫూర్తితో ముందుకు కదులుతూ ధైర్యంగా అడుగు వేయాలి. పాఠశాలల్లో టీచర్లు అయినా, సమాజంలో స్నేహితులైనా, కుటుంబంలోని అంకుల్స్ అయినా టచ్ చేసి మాట్లాడుతుంటారు. అది ఏది బ్యాడ్ టచ్, ఏది గుడ్ టచ్ అని చెప్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులకు, గురువులకు ఉండాలి. వంచకులు, కీచకులు,సమాజంలో ప్రమాదకరమైన వ్యక్తులు ఉంటారని గ్రహించాలి . జాగ్రత్తగా ఆడుగులు వేస్తూ జీవనయానాన్ని సాగించాలి. ఇలా చేస్తే సత్ఫలితాలు వస్తాయని అభిలషిస్తున్నాను.

-సునీత బందారు
9440671530

భూత దయ (కథ)

పూర్వం అడవిలోని జంతువులన్నీ కలిసి మెలిసి ఐకమత్యంతో ఉండేవి . వాటికి నాయకత్వ సమస్య లేదు. కానీ కాలక్రమంలో వాటి మధ్య అభిప్రాయ భేదాలు రావడంతో నాయకత్వం అవసరం ఏర్పడింది.

ఒకరోజు అవన్నీ ఒకచోట సమావేశమై నాయకుని గూర్చి చర్చించాయి. కుందేలు తప్పనిసరిగా మనకు ఒక నాయకుడు ఉండాలని ఉంది .ఆ నాయకుడు పరాక్రమవంతుడై, ఇతరులను రక్షించే విధంగా ఉండాలని, సింహమే అందుకు తగినదని నక్క అంది. గాడిద మాట్లాడుతూ "మన అడవిలో ఉన్న ఒకే ఒక్క సింహం ప్రస్తుతం ఇక్కడ లేనందువలన, అది మన మీద దయతో మనను చంపకుండా ఆహారం కొరకై ప్రక్కనున్న మరొక అడవికి వెళ్ళినందున ఆకారాల్లో అందరికన్నా పెద్దది అయిన ఏనుగే మనకు నాయకుడు అంది. గాడిద నుంచి ఆ మాట వచ్చేసరికి మిగతా జంతువులన్నీ ఏనుగు నాయకత్వానికి తలలు ఊపాయి .కానీ నక్క దానిని వ్యతిరేకించి కేవలం శరీరం ఉన్నంత మాత్రాన సరిపోదు. ధైర్యం, పరాక్రమం ఉండాలని అంది .ఏనుగు వెంటనే "చూడు నక్క బావా! నేను ఎంత పెద్ద బండరాయిని అయినా, కలప దుంగ నైన అవలీలగా పైకి లేపుతాను. మన దగ్గర అటువంటి బలం ఎవరికైనా ఉందా" అని ప్రశ్నించింది? సింహానికి, ఏనుగుకు మిత్రత్వం ఉంది. అందువల్ల అవి ఏనుగును వ్యతిరేకించలేదు. ఏనుగే అడవికి రాజుగా ఎంపికయింది.

ఇలా కొన్ని రోజులు గడిచాయి. ప్రక్కనున్న అడవి నుండి మరొక సింహం వచ్చి ఈ జంతువుల పై దాడి చేయసాగింది. ఇది గమనించిన మిగతా జంతువులు అన్నీ రాజైన ఏనుగుకు మొఱ పెట్టుకున్నాయి. ఏనుగు ఆ సింహంతో యుద్ధానికి తయారయింది. కానీ దానికి లోపల భయంగానే ఉంది .అయినా తప్పదు. ఆ అడవి సింహం ఏనుగు రాకను గమనించి దాని కుంభస్థలంపై దాడి చేసింది. ఏనుగు ఒకే ఒక్క దెబ్బకు కిందపడిపోయింది.

అప్పుడే అటుగా వచ్చిన ఏనుగు మిత్రుడైన ఈ అడవికి చెందిన సింహాన్ని చూసి ప్రక్క అడవి సింహం పారి పోయింది. సింహం తన మిత్రుడైన ఏనుగును పైకి లెమ్మనీ, తాను ఉన్నానని ,భయం వలదని చెప్పింది. ఇంతలో అక్కడకు వచ్చిన మిగతా జంతువులు ఏనుగును చూసి నవ్వాయి. సింహం వాటిని ఊరుకోమని సైగ చేసింది .

వెంటనే అక్కడకు వచ్చిన నక్క "ఈ అడవికి రాజు సింహమే "అని ప్రకటించింది. మిగతా జంతువులు అన్నీ కూడా సరేనన్నాయి. ఏనుగు కూడా సింహం తన మిత్రుడూ, తన ప్రాణాలు కాపాడిన వాడు కాబట్టి అంగీకరించింది. అప్పటినుండి అడవికి రాజుగా సింహం ప్రకటింపబడింది .

నక్క తన మాటను నెగ్గించుకొనుటకై ప్రక్క అడవి సింహాన్ని ఉసిగొల్పి ఏనుగుపై దాడి చేయించినట్లు ఎవరికీ తెలియదు .అందుకే అది జిత్తులమారిగా పేరుతెచ్చుకుంది .ఆకారాన్ని బట్టి నిర్ణయం చేసినందుకు గాడిద తెలివి తక్కువది అయింది .నాయకుని ఎన్నుకొమ్మని మంచి సలహా ఇచ్చినందుకు కుందేలు తెలివిగలదానిగా పేరు తెచ్చుకుంది .అందుకే సింహం చంపిన జంతువును నక్క భుజించి కాలం వెళ్లదీస్తున్నది. తనను రాజుగా చేసిన నక్కను సింహం ఏమీ అనలేక పోయింది.

-సంగనభట్ల చిన్న రామ కిష్టయ్య,
మొబైల్: 9908554535.

బాపుకు ఉత్తరం... (కథ)

నిన్ను వదిలి పెట్టి వచ్చి చానా దినాలు అయింది.
బాగా యాదికి వస్తున్నది అమ్మ .,..
పాతికేళ్లు నన్ను ప్రాణంగా చూస్తిరి
చంటి పిల్లోడి
లెక్క గావురమే జెస్తిరి.....
సక్కగా నన్ను సదువుకోమంటే ఇనకపోతి
...
అల్లరి చిల్లరగా నేను దోస్తులతో ఆడిన గాని
నన్ను ఏమి అనకపోతిరి....
పోరంబోకు పోరగాళ్ళ మాయ మాటలు
విని ఏజెంట్ వలలోన చిక్కుకుంటి నేను.... చిన్న పనులకే
డబ్బులెక్కువని నాకు డబ్బాశ చూపించి ఆశలే
కలిగించే.....నువ్వు పాణంగా చూసేటి తరి భూమిని
నేను తాకట్టుపెట్టి నీ కళ్ళు గప్పి నేను దుబాయ్ వస్తి.
ఇక్కడికి వచ్చాక తెలిసింది బాపూ ...
నా కలలన్నీ కల్లలే నని నా ఆశలన్నీ ఆడి ఆశలే నని ఈ
ఎడారిలో ఎండమావులని.....
మంచి నౌకరి అని చెప్పింద్రు... గుమస్తా పని
అన్నరు...కానీ చేయరాని..చేయకూడని పనులన్నీ
చేయిస్తున్నరు... చేసిన పనికి కడుపునిండా తిండి లేదు
కంటినిండా నిద్ర లేదు....ఎటు పోదాం అన్నా ఏమీ
తెలియదు మా బాధ చెప్పుకోను భాష రాదాయె..... సెలవు
దినము లేదు రికాము ఉంచరు...ఇద్దరు ఉండే గదిలో
20 మందిని కుక్కుతరు ఎవరన్నా ఎదిరిస్తే ఇసుక మేటల్లో
పాతరేయ బట్టే.....
అందరూ మీరుండి బాపు...నాకు
దిక్కు లేని చావు వచ్చేట్టు ఉంది...నవ్వు ముఖము లేదు...
ప్రతిరోజు నరకమే నాకు.....
నువ్వు చెప్పినట్టు నేను సదువుకుంటే నా గతి ఇట్లా ఉ
ండకపోవు....
మంది మాటలు విని మిమ్మల్ని విడిచి పెట్టి నేను
దుబాయి కొచ్చి పెద్ద తప్పు చేసిన...
చేసిన తప్పును సరిదిద్దుకో లేను
మీ కన్న రుణము నే తీర్చుకోలేను...
ఆడికి రాలేక ఈడ ఉండలేక నడిమిట్ల నా బతుకు బండ
లే అయ్యింది...బతికుంటే మళ్ళీ కారటు రాస్తా
దుఃఖ మొస్తుంది బాపూ....
ఇట్లు
నీ కొడుకు రాజేశం

-కళావతి కందగట్ల
9948263004

స్త్రీ మూర్తికి ప్రణతులు?!

ఆమె...
సృష్టి ప్రతీకం
విశ్వ వికాసం
శక్తి స్వరూపం
ఆ హాసం జీవన నాదం
ఆ వదనం నిర్మల సధనం.
ఆమె?
మాతృత్వపు వరం
దాతృత్వపు పరిమళం
ఆ మది మమతల మడి
ఆ హృది మానవతల గుడి.
ఆమె?
సహన శిల్పం
సౌహార్ద శిఖరం
ఆ ఒడి చల్లని సంద్రం
ఆ సడి శ్రావ్య సంగీతం.
ఆమె ...
ఇల వెలసిన దైవత్వం
నడయాడే మూర్తిమత్వం
ఆ అడుగు వెన్నెల బాట
ఆ జీవితం త్యాగాల తోట.
ఆమె? తపశ్వి ...
మహా మనీషి ...
ఆ సహనత్వం ఆజరామరం
ఆ వ్యక్తిత్వం అనిర్వచనీయం.
ఆమె..
తల్లిగా మనకు పురుడు పోస్తుంది
తనయగా ఆత్మీయత పంచుతుంది
సోదరిగా అనుబంధం పెంచుతుంది
సహధర్మచారిగా సర్వం దారబోస్తుంది
ఆ త్యాగ ధాత్రిని ?.
గౌరవ వందనం సమర్పిద్దాం
ఆ పుణ్య మూర్తికి?.
శిరస్సు వంచి ప్రణమిల్లుదాం
(మార్చ్ 8 న అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా అతివకు అక్షర హారతి పడుతూ?)

- కోడిగూటి తిరుపతి
9573929393

స్త్రీ ఆకాంక్ష..

జన్మతోనే మాతృమూర్తుల
మమతానురాగాలు,
'ఆడది'అంటూవ్యత్యాసం
చూపని వీక్షణాలు,
ఆడ,మగ అన

మాను...మనిషి

మనిషి కన్నా
మాను మిన్న
మనిషి మరణిస్తాడు
బూడిదవుతాడు
మాను మరణిస్తుంది
మనిషికి ఉపయోగ పడుతుంది
మనిషికి స్వార్థం ఎక్కువ
ప్రకృతిని తన స్వార్థం కోసం
ధ్వంసం చేస్తున్నాడు
మానుకు పరోపకారం ఎక్కువ
తన సర్వస్వం మనిషి కోసం దారపోస్తుంది..

మనిషి ఈ భూమి పైకి
వచ్చి పోయే అతిథి
మాను సంతతి
భూమి పై శాశ్వతంగా ఉంటుంది
మనిషి మానును హింసించినా
ధ్వంసం చేసినా
పచ్చగా బతుకుతూనే ఉంటుంది
చెడు వాయువును మాను తీసుకొని
మనిషికి ప్రాణవాయును అందిస్తుంది
పరోపకారం చేస్తూనే ఉంటుంది
మాను లాగా మనిషి బతకాలి..

మాను మనిషికి
ఆకలికి ఆహార మవుతుంది
ఎండకు నీడవుతుంది
వానకు గొడుగవుతుంది
మనిషి చివరి మజిలీకి
తన తనువునే అర్పిస్తుంది
మానుకు త్యాగం మాత్రమే తెలుసు
మనిషికి స్వార్థం మాత్రమే తెలుసు

– బూర దేవానందం
9494996143.

మసక బారుతున్న మానవత్వం

కత్తులను కడుపులో దాచుకొని
స్వార్థ గంధాన్ని ఒళ్ళంతా పూసుకొని
కండ్లల్లో కాఠిన్యాన్ని పెట్టుకొని
మానవత్వాన్ని మంటల్లో కలుపుతుంద్రు
మనషుల మధ్య మృగాళ్ళ తిరుగుతుంద్రు.

ఆస్తులకై అర్రులు చాచి
అనైతిక చర్యలకు తెరలు లేపి
కసి వంతెన పై కదులుతుంద్రు
కారుణ్యాన్ని మంటల్లో కాలుస్తుంద్రు.

మాటలతో గుండెల్లో నిప్పు బెట్టి
పాత పగల కొలిమిని అంటుపెట్టి
విద్వేష రాగాలు తనువులో మీటి
విషపు జల్లులను కురిపిస్తుంద్రు
కాదంటే కత్తులతో కాటేసి
మరణ శాసనాలు లిఖిస్తున్రు
మానవ జాతికి మచ్చ తెస్తున్రు.

చిరిగిపోయిన మానవత్వపు బొంతకు
మరమ్మతులు చేసుకోవాలి
మనషుల మధ్య పూల వంతెన నిర్మించుకొని
మాటల మకరందాన్ని ఒంపుకొని
ఘనీభవించిన దాతృత్వాన్ని కరిగించుకొని
మమతల పరిమళాలను పంచాలి
శాంతి కపోతాన్ని ఎగరెయ్యాలి
(న్యాయవాదుల హత్యలకు
అక్షర నివాళి తో)

–తాటిపాముల రమేష్
7981566031

మట్టి మారాజు

పేరుకే రైతే రాజు
వజ్రమకుటం లేని మహారాజు
మన్నురంగు పూసుకున్న
బట్ట ముక్కనే కిరీటంగా ధరించిన
కడుపునిండా
బువ్వ పెట్టే మట్టిమారాజు.

నేల ఉద్భవించిననాడే
జన్మించిన రైతు ఆరాజు
ఆరాజు నేడు
తాత్కాలిక స్వార్థపు రాజులైన
కత్తిమెదళ్లకు బలైపోతున్నాడు.

తుమ్మితే ఊడే ముక్కులాంటి
ఈ ఐదేళ్ల కుహనారాజుల చేతిలో
ఆజన్మాంతం అన్నం పెట్టే
ఆ అన్నదాత కీలుబొమ్మైనాడు చూడు.

జనత జాలిపడితే
గద్దెనెక్కిన ఆ మిన్నులోని రాజులు
మన్ను రాజైన రైతన్న శ్రమను
గద్దలా తన్నుకుపోతున్నారు
పప్పు బెల్లాల్లా
దళారీలకు దోచిపెడుతున్నారు.

ఇలాగైతే
ఇంకెక్కడ వ్యవ"సాయం" దక్కుతుంది
ఆ అన్నదాతకి ?
సరికదా
ఆ భూమి బిడ్డల శక్తికి?
"వ్యయం" కట్టబడుతోంది
ఆ తరాజుల
పాపాల పంపకాలపై....

– నాగముని. యం
9490856185

అమె కష్టాలకెపుడు ఓటమే..

అందమైన ఆ.. పచ్చని పైరు
ఎదుగుదలకు అడ్డంకైనా కలుపు మొక్కలు
కలుపును ఏరేస్తూ....
పైరును ఏపుగా ఎదగనిస్తూ...
ఆ మండే ఎండల్లో
అప్పుడప్పుడు వీచే గాలి సవ్వడుల్లో...

ఓ కష్టజీవి కూని రాగాలు ...
అవి శ్రమను మరిపించే పల్లె స్వరాలా...
కావు...కావు
అవి బంధాల బాధ్యతలకై
మది వేదనల రోదనలు..
చిందించే శ్రమ స్వేదపు చుక్కలతో
పోటీపడి
ఉబికి వస్తున్న కన్నీటి ఊట దారలు...
బతుకు పోరులో భాగమైన
కూలీ కష్టంలో లీనమై
కడుపు కట్టుకొని
కన్నపేగు కోసం తల్లడిల్లే
ఓ పల్లెతల్లి జీవన మార్గపు దారులు...
కాలం కాటు వేస్తే
కనుమరుగైన కట్టుకున్న బంధం
తన జ్ఞాపకాల సంపదగా
మిగిల్చిన రెండు ప్రతిరూపాలు...
అవే రెప్పల మాటు కనుపాపలు...

తన ఆలోచనలను మదిస్తూ...
అహోరాత్రులు శ్రమిస్తూ...
రెక్కలు ముక్కలైనా
తనువు పిక్కలైనా
బిడ్డల మహోన్నతికై నిరంతర పరిశ్రమలో
కష్టాలను కలుపు మొక్కల్లా ఏరేస్తున్న...
ఆ కూలితల్లి మది రోధనలు
జీవన నాదాలే...
ఆ కన్నీటి దారలు
కోటి కలల ఫలిత ఆనందభాష్పాలే...
కడుపు తీపికోసం పడే యాతనలో...
ఆమె కష్టాలకెపుడు ఓటమే..

–రాచర్ల శ్రీనివాస్
9704246125

మట్టి హృదయం

మట్టి తల్లిని నమ్మిన రైతు
మట్టితోనే సహవాసం
మట్టి పరిమళాన్ని ఆఘ్రాణిస్తూ
కష్టనష్టాలన్ని పుడమి తల్లికి చెప్తూ
భూదేవి ఒడిలోనే సేద తీరు !!.
సూర్యునితో పోటీపడి రేయంత
కష్టపడి విశ్రాంతి ఎరుగని
నిత్య శ్రామికుడు
కర్మ సాక్షిగా ఏమి ఆశించని కర్మ జీవి!!
కారు కారుకు చెమట కారుస్తూ
కంటికి రెప్పలా కాపాడి పెంచి
చేతికొచ్చిన పంట కన్నను
దళారులు ఎగరేసుకు పోగా
ధరణిని నమ్మిన తండ్రికి దిగులు!!
కల్తీ కాలం కలికాలం
బోల్తా కొట్ట బోర్లా పడుడే
కర్మజీవికి కష్టనష్టాలే!!ప
మనిషిని నమ్మితే విషం
మట్టిని నమ్మితే సుఖం
తన్నినా పొడిచినా ఏమనక
అన్నీ ఇచ్చే వసుధ మనసు సున్నితం
కడగండ్లలో తేలినా
తొణకని ధైర్యంతో
కాలం వెళ్లదీసే అల్పసంతోషి!!
సహనం ఊపిరిగా
చెమటే ఆయుధంగా
హలం ఆభరణంగా ధరించిన
ఆకలి తీర్చే అన్నదాత మేటి
మట్టి రాజుకు ఎవరు సాటి!!

–డా.చీదెళ్ళ సీతాలక్ష్మి
9490367383

నేటి నిజం

గతంలోని బంధాలన్నీ జ్ఞాపకాలుగా మారితే
వర్తమానం వసంతంలా పరిమళిస్తుంది
ఒరిగిపోతున్న పొద్దులో.. ప్రతిక్షణం
దాంపత్యబంధం ఉదయగానమవుతుంది

ఒకరికొకరు తోడుగా ఆ తీయని బంధంలో
సహజైక్యం ఊలరిపోసుకుంటుంది
జీవనప్రస్థానంలో
ఆ బంధమే... పవిత్రబంధమవుతుంది..!

- కెరె జగదీష్

గుంటూరు ప్రాంత స్వాతంత్ర్యయోధుల గాథలు స్ఫూర్తిదాయకం

పుస్తక సమీక్ష



'స్వాతంత్ర్యమే మా జన్మ హక్కని" అనే పేరుతో గుంటూరు జిల్లా అలనాటి ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుల త్యాగమయ వీరగాథలను వేంకట నారాయణగారు ఎంతో ఆర్తితో రాసారు. దాదాపు 101 మందిని మాత్రమే ఎంపిక చేసుకొన్నారు కానీ.. ఇంకా చాలా మందే వుండి వుంటారు. వ్యాసాల్లో ఆయా వ్యక్తుల గొప్పతనం– బలమైన సన్నివేశాలు చెప్పి వుంటే రేపటి తరం వారికి స్ఫూర్తిదాయకంగా వుంటాయి.

ఉదా:– మోటూరు హనుమంతరావు (పేజి.177) గారి గురించి రాసింది 2019లోనే హనుమంతరావుగారు మద్రాస్ అసెంబ్లీలో రాజాజీ, తరువాత కాలంలో ప్రకాశంగార్లపై బలంగా జనం గొంతు వినిపించేవారు. ఆ సన్నివేశాలు రాస్తే బాగుండేది. కాంగ్రెస్ మంత్రి కల్లూరిని ఓడించారు. ఎమ్.పి. చేసారు. ప్రపంచ ప్రఖ్యాత సైంటిస్ట్ నాయడమ్మ–హనుమంతరావుగార్లు గుంటూర్‌లో ఒకే హాస్టల్‌లో రూంమెట్స్.. బసవ పున్నయ్య– సుందరయ్యలాంటి వారు ఆ హాస్టల్‌కు వెళ్ళి మోటూరు వార్ని కల్సేవారు.

అలాగే వావిలాల గోపాలకృష్ణయ్యగారు (పేజి.197) చాలా సాధారణ జీవితం గడిపారు. రేపటి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఈ రాత్రి తన బట్టలు తాను వుతుక్కొంటుంటే.. గెస్ట్ హౌస్‌లో వున్న ప్రధాని నెహ్రూ గమనించి అధికార్లను అడగగా.. "రేపు కార్యక్రమానికి తన బట్టలు ఉతికి రడీ చేసుకొంటున్నాడు" అని చెప్పారుట. నెహ్రూ అవాక్కైనాడుట– ఒక ఎంఎల్‌ఏ స్థితి అది. అదీ నిరాడంబరత అంటే! హాట్సాఫ్ వావిలాల!! అలాగే వ్యాసాల్లో ఆయా వ్యక్తుల పుట్టిన తేది– సంవత్సరం– మృతినొందిన తేది.. తల్లిదండ్రులు పొందిన పదువులు రాస్తే వ్యాసం– పుస్తకం సమగ్రత సంతరించుకొనేది. పై రెండు విషయాలు స్ఫూర్తిదాయక అంశాలుగానే చెప్పాను. ఇది విమర్శకాదు –సూచన మాత్రమే. ఆనాడు– గుంటూర్–ప్రకాశం– జిల్లాలు– ఒకటిగానే ఉండేవి. ఇంకా కొందరు గొప్పవారు ఈ గ్రంథంలో లేరు,..

స్వామీ సీతారాం– సూర్యదే వర రాజ్యలక్ష్మి– యం.ఎస్. రాజలింగం– మందపాటి నాగి రెడ్డి, పోతేపెద్ది నరసింహమూర్తి, పాదర్తి సుందరమ్మ, పాతూరి నాగభూషణం, దుగ్గిరాల గోపాల కృష్ణయ్య, త్రిపురనేని రామస్వామి చౌదరి, నరసింహస్వామి చౌదరి, టంగుటూరి ప్రకాశం– జొన్నలగడ్డ రామలింగయ్య– దరువూరి వీరయ్య, తుమ్మల సీతారామమూర్తి చౌదరి, కొల్ల వెంకయ్య– కాసుబ్రహ్మానందరెడ్డి, కన్నెగంటి హనుమంతు, ఉన్నవ లక్ష్మీనారా యణ– కల్లూరి చంద్రమౌళి– కనపర్తి వర లక్ష్మమ్మ– ఉన్నవ లక్ష్మీ బాయమ్మ లాంటి గొప్ప వ్యక్తుల గురించి ఎంతో స్ఫూర్తి దాయకంగా ఈ పుస్తకం రాసిన వేంకట నారాయణ అభినందనీయులు.

ప్రతులకు: టి. రామసీత,2–సి– గీతా రెసిడెన్సీ– ఎన్ఆర్‌టి సెంటర్
చిలకలూరిపేట– 522 616,గుంటూరు జిల్లా. ఏ.పి.
సెల్: 8341586274

– తంగిరాల చక్రవర్తి
సెల్:9393804472

నవ్యతకు పెద్ద పీట వేసిన సావిత్రి...

–ఆచార్య కడారు వీరారెడ్డి

నవీ ముంబయి కి చెందిన సావిత్రి గారు తమ కవిత్వ సృజన యందు అభివ్యక్తికి పెద్ద పీట వేశారని ప్రముఖ కవి,రచయిత కడారువీరారెడ్డి గారు అన్నారు.ముంబయికి చెందిన కవయిత్రి సావిత్రి రంజోల్కర్ గారు రచించిన"ఆశల ఆమని" 'జూమ్' వేదిక ద్వారా ఆదివారం ప్రపంచ కవితా దినోత్సవ సందర్భంగా జరిగిన ఆవిష్కరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు.ఉదయ సాహితీ ఆధ్వర్యంలో నిర్వహింపబడిన సభలో ఆయన'ఆశల ఆమని' గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లడుతూ సమకాలీన సంఘటనలను తమ కవితా వస్తువులుగా మలుచుకుని చక్కని కవిత్వాన్ని రాశారని కొనియాడారు.సావిత్రి గారి కవిత్వంలో భావుకతతో పాటు తాత్వికత ఉందని అభినందించారు.మన సంస్కృతీ సాంప్రదాయాల పట్ల, ఆమెకు ఉన్న ఆసక్తిని ఇందలి కవితల్లో చూడగలమని అన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ప్రముఖ కవి, విమర్శకులు శ్రీ దాస్యం సేనాధిపతి గారు మాట్లాడుతూ కవయిత్రి సావిత్రి రంజోల్కర్ గార కవిత్వంలో ఆమె ఉత్తమ వ్యక్తిత్వం సున్నిత మనస్తత్వం.. సామాజిక చింతనం ముప్పేట అల్లుకు పోయాయని కొనియాడారు.వస్తు విశ్లేషణ లో తాత్వికత, అభివ్యక్తి లో నవ్యత శిల్పంలో చతురత వంటి అంశాలు ఆమె కవిత్వానికి శోభను కూర్చాయని పేర్కొన్నారు.సభకు అధ్యక్షత వహించిన ఉదయ సాహితీ రాష్ట్ర అధ్యక్షులు,నేటికవిత అడ్మిన్ శ్రీ దాస్యం లక్ష్మయ్య గారు మాట్లాడుతూ భారతీయత వ్యక్తిత్వ వికాసం.. తెలుగు దనం నైతిక విలువలు ప్రబోధించే విధంగా కవయిత్రి సావిత్రి గారు తమ కవితలను తీర్చిదిద్దారని అభినందించారు.గౌరవ అతిథి గా పాల్గొన్న ప్రముఖ కన్నడ నవలా రచయిత్రి శ్రీమతి సాధనా రంజోల్కర్ గారు మాట్లాడుతూ సావిత్రి గారు తెలుగులో కవితలురాసి అందరి మన్ననలు పొందడం చాలా ఆనంద దాయకమని అన్నారు.శ్రీ రాఘవేంద్రరావు కులకర్ణిగారు మరాఠీలో మాట్లాడుతూ సావిత్రి గారు కవిత్వ రచనలోభావుకతను ప్రదర్శించారని ప్రశంసించారు.డా.వైరాగ్యం ప్రభాకర్ గారు మాట్లాడుతూ సావిత్రి గారు తమ కవిత్వం ద్వారా సమాజానికి మంచి సందేశాన్ని అందించారని అన్నారు. తిరుపతి కి చెందిన కవయిత్రి శ్రీమతి పత్తిపాటి రూపలతగారు గ్రంథం పరిచయం చేస్తూ సావిత్రి గారి రచనా శైలిని విశ్లేషించారు. సామాజిక చైతన్యం కోసం ఆమె కవిత్వం దోహద పడగలదని అన్నారు.'నేటి కవిత'సమూహానికి చెందిన కవయిత్రులు ముద్దు వెంకట లక్ష్మి గారు, రమాదేవి కులకర్ణి గారు,వకుళ వాసు గారు, వెగ్గలం ఉషఃశ్రీ గారు, లక్ష్మి పద్మజ దుగ్గరాజు గారు, సావిత్రి గారికి అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సావిత్రి గారి శ్రీవారు శ్రీ ప్రేమ్ దాస్ రంజోల్కర్ గారు మాట్లాడుతూ కవయిత్రి గారు తమ మొదటి గ్రంథాన్ని వెలువరించడం సంతోషదాయకమని పేర్కొన్నారు.గ్రంథకర్త శ్రీమతి సావిత్రి రంజోల్కర్ గారు మాట్లాడుతూ తమకు చిన్నప్పటి నుండి పుస్తకాలు చదివే అలవాటు ఉందనీ అన్నారు. 'ఆశలఆమని' గ్రంథం వెలుగులోకి రాయడానికి సహకరించిన ప్రతీ ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారుసభ ఆరంభంలో డా.అనూజ్ఞ రంజోల్కర్ అతిథులకు స్వాగతం పలికారు...ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, మహారాష్ట్ర,కర్నాటక రాష్ట్రాలకు చెందిన కవులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.సావిత్రి గారి మాతృమూర్తి శ్రీమతి నళినీ బాయి, అక్కగార్లు.. సుధ,సీతారాణి, బంధువులురామకృష్ణ,అనురాధా తేర్కర్,రేణుకా డిగ్గీకర్,అంబుజా రంజోల్కర్,స్నేహితులు నందా శాస్త్రుల్ కర్,అంజు బజాజ్ లు ప్రసంగించారు.సావిత్రి గారు తమ మాతృమూర్తి శ్రీమతి నళినీబాయి కొర్పోల్ గారికి'ఆశల ఆమని' పుస్తకం అంకితమిచ్చారు.డా.ప్రజ్ఞరంజోల్కర్ వందనసమర్పణతో కార్యక్రమం ముగిసింది..

నిరంతరం..!

గుడిలో దీపాన్ని
ఎదలోన వెలిగించు!
అందరికీ నీ నవ్వులు పంచు!
నిరంతరం ఆ నవ్వులు
నిన్ను ఆశీర్వదించు
నీలో ఆశలు పెంచు
ప్రగతి కిరణమై
ప్రగతి కిరణపు బాట
నడిచి చూడు ఓసారి
గెలుపు నీదే ప్రతిసారి
ఎ మానవా!
మానవ జీవితం
బంధాల అల్లిక
సుఖదుఃఖాల కలయిక
సత్యం తెలుసుకో
సన్మార్గంలో నడుచుకో
మంచిగా మనసులో
అనుక్షణం ఆ దేవుడు
నీకు తోడుగా ఉంటాడు..!!

– రేణుక పురుషోత్తం
బుధారం
సెల్: 78881 565360

పర్యావరణం

ఝాంకార నాట్యం సవ్వడి చేయ
పూల తేనెలు గ్రోల తుమ్మెదలు లేవు
గాలిపటం వోలే పై పైకి పోవ
గుంపులుగా ఆడేటి తూనీగలు లేవు..!

ప్రాణవాయువు పంచేటి చెట్లు..
విద్యుత్తు కోతకు విరిగిపడి వుంటే
పక్షుల పరిషానుతో ఎగిరిపోబట్టే
పరిశ్రమల మురికి
నదీజలాలను కాలుష్యం చేస్తే–
జలచరాలు ఎన్నో చచ్చి పోబట్టే..!

విమానాలు, రాకెట్లు రయ్యమని
నింగిలో పోతే, ఓజోన్ పొర కరిగిపోయే
పాశ్చాత్య దేశాల సంస్కృతి వల్ల
వెర్రి నాగరికత మొగ్గ తొడిగింది..!

వర్షాభావం వల్ల నీరును కొంటే..
జీవితం తృష్ణగా చిగురు వేసింది
రెండు చేతుల చెట్లను పెడితే
హరిత విప్లవంతో భూమి పులకించి పోవు
నీళ్ళు వుంటేనే పంటలకు కొదవేమి లేదు
పర్యావరణం పచ్చగా వుండూ...!!

–దేవనపల్లి ఓగన్న
సెల్: 07972289784

చరమ గీతాలు

నమ్ముకున్న భూమిని
దొరలు దోచుకుంటుంటే
అన్యాయాన్ని ఎదిరించలేని రైతన్న
అన్నం పెట్టే భూమిని అమ్ముకొని–
వలసలు పోయే అడ్డా కూలిగా మారి..!
అంతరాత్మను బంధించి
ఆకలిని చంపుకుని–
చేజారిన పంటకై చింతిస్తూ
నిలువ నీడ లేక
బ్రతుకీడుస్తున్నాడు వలస కార్మికుడిగా..!
పూట గడవక పస్తులుండి
బిడ్డల కీర్తికై పాటుపడుతూ
కోటి ఆశలతో పరితపిస్తున్నాడు..!
మారేదెలా ఈ దారుణ పరిస్థితులు
అన్యాక్రాంతానికి
పాడేదెలా చరమగీతాలు..!

– దుర్గా సాహితీ
సెల్:97053 54567

విజయ భారతి..!!

మహోన్నత హిమ గిరుల శిఖరాల వైపు
తల ఎత్తి చూడు..
అక్కడ మా భారత జాతీయ జెండా
రాజసం కనబడుతుంది!

మా భారతీయుల గుండె శబ్దం విన్నావా..
సమున్నత భావాల ఐక్యతా రాగం వినబడుతుంది!

మా ప్రతి శ్వాసలో
విశ్వాసమే ఊపిరిగా ఉంది
దయా, దాన గుణ సౌశీల్యాలలో
మా ప్రాణ ధన దేహాలు పోటీ పడుతుంటాయ్!

విజయ వీర విహారంలో..
మా వీరుల మీసం మెలి తిరుగుతుంది–
మా ఆడపడుచుల ధైర్యం, తెగువ
ఉరుములౌతాయ్.. పిడుగులు కురిపిస్తుంటాయి..!

వినయ విధేయ అతిథ్యాలలో
మా యెదలు.. మా గృహాలు
పూజా మందిరాలవుతాయ్..!
అహింస, సత్య, ధర్మాలతో
ప్రపంచ శాంతికి హారతులిస్తుంటాయ్..!!

– శివ మంచాల
9004428159

ఎనభై ఎనిమిది కవుల "గెలుపు మనదే"

పుస్తక సమీక్ష



"గెలుపు మనదే" కవితా సంకలనం ఈరబత్తిని రవి సంపాదకత్వంలో వెలువడింది. ఇటీవల కాలంలో తెలుగు సాహిత్యంలో విరివిగా కవితలు దర్శనమిస్తున్నాయి. వెబ్ మ్యాగజైన్స్, సోషల్ మీడియాల ద్వారా, వాట్సప్ గ్రూపుల ద్వారా తెల్లవారితే కవితలు దర్శనమిస్తున్నాయి. ఒక్కో కవి తన కవితను అనేక విధాలుగా ప్రచారం చేసుకోవడం కనిపిస్తోంది. అయితే మంచి కవితలు, కవిత్వం ఎక్కడ దొరుకుతుంది? అనే ప్రశ్న వేసుకుంటే అది కేవలం ప్రశ్నలా ఉండిపోకుండా ఈరబత్తిని రవి గారు మంచి కవిత్వాన్ని ఒక చోట చేర్చే క్రమంలో తీసిన సంకలనం ఇది. ఈ సంకలనంలో కవితలన్నీ చాలా వరకు కవిత్వంతో నిండుకున్నవే. అయితే ఇక్కడ పెద్దవారా? లేక వర్ధమాన కవులా? అనే వ్యత్యాసం ఎందుకో చేయాలనిపించడం లేదు. పెద్దవారిలో తాము కవిత్వమే రాస్తామనే నమ్మకం, చిన్నవారిలో నేను రచించిన కవితను కవిత్వంగా అంగీకరిస్తారా అనే భయం ఉండి తీరుతుంది. ఒక్కోసారి నమ్మకం వమ్ము అవుతుందేమో కానీ, భయం గెలిచి తీరుతుంది. అలాగే ఇందులో వర్ధమాన కవుల కవిత్వం ఎంతో చక్కగా అనిపించింది. అందుకు కొన్ని కవితల్ని, కవుల్ని ఉదాహరణగా తీసుకుంటే..

"పువ్వు సందేశం" కవిత చదువుతుంటే చాలా ప్రశాంతంగా ఉంది. ఎందుకంటే వస్తువు పువ్వు కనుక. " పువ్వు నవ్వుతూ చెబుతోంది/ నాలాగే నువ్వు కూడా ఉండమని// పువ్వు పరిమళిస్తూ చెబుతోంది/ నాలాగే నీ కీర్తి ప్రతిష్టలను వ్యాపింపజేయమని/ పువ్వు వికసిస్తూ చెబుతోంది/ నువ్వు నాలాగే ఉన్నత స్థానంలో ఉండాలని/ పువ్వు తనలోని మకరందాన్ని అందిస్తూ చెబుతోంది/ నువ్వు నాలాగే దానకర్ణిగా పేరు తెచ్చుకో.." కవయిత్రి పూజితారెడ్డి ఆలోచనలో ఎంతో సందేశం ఉంది. రాబోయే తరం అలా ఆలోచించడం ఎంతో అవసరం కూడా.

"సంకల్పబలం" అనే కవితలో ఆరుట్ల మాధవి స్త్రీ ని ఉద్దేశించి ఇలా అంటారు "నీ సంకల్పమే నీ ఆయుధమైతే /దుర్మార్గుల పాలిట ఖడ్గము అవుతావు" అని. నేడున్న పరిస్థితుల్లో స్త్రీ సంకల్పమే కాదు శరీరం కూడా ఆయుధంగా మారాల్సిన అవసరం ఉంది.

సూర్య కిరణాల సొగసును వర్ణిస్తూ కందూరి సుజాతారాణి కవిత"కిరణాభరణం" ,మహాకవి దాశరథికి నీరాజనాలు అందిస్తూ గాజుల భారతి రచించిన "తెలంగాణ రత్నం", గెలుపు ఓటములను రెండుమాటల్లో చెపుతూ కవి జటావత్ మునినాయక్ "ఓ మనిషి" అనే కవితలో ఇలా అంటారు "గెలుపు ఊరికే రాదు/ ఒక్కసారి వచ్చిందా ఇక ఎవరూ ఆపలేరు" అని. నిజమే. ఒక వ్యక్తి ఉన్నత స్థానాన్ని అందుకోవడమే ఆలస్యం. తర్వాత ఆ ఉన్నతి చిరస్థాయిగా ఉండిపోతుందడంలో సందేహం లేదు. ఇందులో వాస్తవం ఉంది. మరో తెలంగాణ మహాకవి కాళోజీని కీర్తిస్తూ కవి పోతుగంటి వీరాచారి రచించిన కవిత "కవిత్వమై రగిలిన నిప్పురవ్వ కాళోజీ". నిజమే ఆనాడు తెలుగు కవిత్వానికి కాళోజీ ఒక మూలస్థంభమై నిలిచారనడంలో సందేహం లేదు. కరోనా సమయంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్న ప్రైవేటు ఉపాధ్యాయులకై బాధపడుతూ మాసని వెంకటయ్య రచించిన కవిత "కారకులెవరూ నీ చావుకు" అనే కవిత ఆర్ద్రతను చాటి చెబుతోంది. కారణం ఏదయినా, ఎవరైనా జీవితాలు గల్లంతు అవుతున్న వారిలో రైతుల తర్వాత ప్రైవేటు ఉపాధ్యాయులదే అనేది వాస్తవం. వీరసైనికులకు నివాళి అర్పిస్తుంది నా దేశం అంటూ ఎలుగెత్తి చాటుతున్న కవిత "నా భారతదేశం". రచించిన కవి అరసవిల్లి మోహనరావు. దేశభక్తిని చాటే ఏ కవితైనా ఆ నిండుతనం వేరు అనిపించేలా సాగింది.

కవిత్వానికి వస్తువు ఏదైనా వేల్లాడదీయచ్చు అనేది నిజం. కాకుంటే అది కవిత్వమై కనిపించాలి అంతే అన్న చందంగా ఈ సంకలనంలో అనేక మంది కవులు తమ కలాల సత్తాను చాటుకున్నారు. అలా సాగిన కవితల్లో ఎం. అమృతరావు రచించిన అసురవధ, కె. రంగనాయకులు రచించిన మేలుకొలుపు, మండలోరు నర్సింహస్వామి రచించిన భగవద్గీత మానవాళికి మహిమానిత్వం, కొండపాక వేణుగోపాల్ రచించిన మట్టి, వెంకు సనాతని రచించిన "మనిషి ధర్మం" గడప కృష్ణవేణి రచించిన "వలసజీవి కష్టాలు" వంటివి ఎన్నో ఉన్నాయి. ఈ సంకలనంలో ప్రతి కవితా సందేశాత్మకంగా రచించడం విశేషం. అన్నింటికంటే ముఖ్యంగా ఈ సంకలనంలో మహిళా కవయిత్రులకు ఎక్కువ స్థానం ఇవ్వడం, కొత్తవారికి అవకాశం కల్పించడం,చివరిగా గెలుపు మనదే అంటూ మంచి కవిత్వాన్ని రచించి, "ఈ విశాల విశ్వంలో ఐకృత ఉంటే గెలుపు మనదే "అనడం ఈ సంకలనానికి ఎంతో సంపూర్ణతను చేకూర్చింది. ముఖ్యంగా ఈ గ్రంథానికి నేటినిజం సంపాదకులు బైన దేవదాస్ గారి ముందుమాట మరింత శోభను చేకూర్చింది. సంపాదకులు, కవి, ఈరబత్తిని రవి ప్రయత్నానికి నా అభినందనలు.

–ప్రతులకు: ఈరబత్తిని రవి,
ఫోన్: 80803 36648

–శైలజామిత్ర
9290900879

కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
పోటీ ఫలితాలు
'బుధవారం బాద్షా'
అడ్మిన్: రమాదేవి కులకర్ణి
నిర్వహణ: డా॥ప్రతికంటం మాలతీలత
ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.

ప్రథమ బహుమతి విజేత
శీర్షిక: తీరని బాకీ

నడవడం నేర్చుకున్నానని
మీ భుజాలు నా వయసుని
మర్చిపోయావి కదూ
నాకు నీకు మధ్య
బంధాన్ని భాధ్యతతో ముడేసి
భుజాల భారం దింపుకున్నావా నాన్న
నీ వెనక నేనొస్తానంటూ మారాం చేస్తే
ఊరుకోవే మళ్ళీ వచ్చి
తీసుకెళ్తానులే అన్నవు కదా
మా ఇళ్ళు వేరని గుర్తుచేసుకోని
అక్కడే ఆగిపోయావ్ కదూ
కట్నానికి ఎకారలమ్మి కానుకిచ్చావ్
నీకంటూ ఏది ఎందుకు దాచుకోలేవు
నేనంటే నీకింత ఇష్టమని
ఎందుకు నాకెప్పుడు చెప్పలేదు
నువ్వు ముందుకెళ్తూ వెనక్కి చూసి
కన్నీళ్ల లోని నన్ను
తువ్వాలతో తుడిచేసావ్ కదూ
నేను మాత్రం అక్కడే
ఆగిపోయాను నాన్న
నాలోని నిన్ను
వెతుక్కోవడంలో ఎదురుచూస్తూ
కథలు చేప్తూ నువ్వు,ఊ కోడుతూ నేను
గతం అనే పడక కుర్చీలో ఊగుతున్నాం
జ్ఞాపకాల చప్పుడులో
నువ్వు గుర్తొస్తున్నావ్ నాన్న
చాలని నేను,
చప్పుడు చేయకుండా తీసుకో
అని నువ్విచ్చిన డబ్బులతో నిండిన గళ్ళబుడ్డి
కదిలించినప్పుడు వచ్చే అల్లరిలో
నీ గారబం గుర్తొస్తుంది నాన్న
నన్ను కసురుతూ నువ్వు
కన్నీళ్లు పెట్టుకున్నావ్ కదూ
నన్ను అప్పగిస్తూ నువ్వు
అప్పులపాలయ్యావ్ కదూ
నన్ను పంపిస్తూ నాకు తెలియకుండా
నా ఆలోచనలతో అక్కడే ఆగిపోయావ్ కదూ
భయపడకు అని నాకు చెప్తూ
నువ్వు బాధపడ్డావ్ కదూ
ఎందుకు నాన్న
ఎప్పుడు వెనకాలే ఉండిపోయావ్
నీ ఋణం తీర్చుకుంటానని నేనను
నీకెప్పుడు ఋణపడే ఉంటాను
తీర్చలేని బాకీని
బాధ్యతగా మోస్తూ..

–సుష్మ మక్తల్

ద్వితీయ బహుమతి విజేత
శీర్షిక: స్మృతి పథం

రేపటి స్వప్నాన్ని చేరుకోడానికి
నిన్నటి జ్ఞాపకాలు గీటురాళ్ళవుతాయి
కొన్ని స్మృతులు చైతన్య దీపికలు
కొన్ని వెంటాడే విషాద చారికలు.
బాల్యంలో గడిపిన క్షణాలు గుర్తుకొచ్చి
మిత్రులంతా జ్ఞాపకాల తెరపైకి వచ్చేస్తారు
ఎప్పుడో యవ్వనం చిగురిస్తున్న వేళ
అందుకున్న ప్రేమలేఖలు స్ఫురణకొస్తే
ఎదవీణ మోహనరాగం ఆలపిస్తుంది
వలపుకుంచె చిత్రించిన ప్రణయకావ్యం
పుటలు పుటలుగా తెరచుకుంటుంది.
ఒకోసారి తోడబుట్టిన వాళ్ళతో అల్లుకున్న
అనుభూతులు చుట్టుముడతాయి.
నాన్న కోప్పడితే అమ్మకొంగుచాటున దాక్కున్న
మధురస్మృతి మనసులోకి వస్తుంది.
జీవితభాగస్వామితో తొలిరాత్రి ముచ్చట్లు
మన బిడ్డల బోసినవ్వులముద్రలు
అ